# HANNA KRUPA®

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 10** **సంచిక : 12**

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| విలియంకేరి... | ఆంద్రూస్ దావల | 4 |
| సీనియారిటీ... | నిమ్మగడ్డ సుధీర్, హైదరాబాద్ | 6 |
| ఫాదర్ హయ్యర్ | ప్రొ॥టి.యస్.వి.ప్రసాదరావు, గుంటూరు | 8 |
| లోకం తీరు | హన్నాకృప డెస్క్ | 10 |
| మీరు బైబిలంతా చదివేశారా? | హన్నాకృప డెస్క్ | 11 |
| జూలై నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్ , ఏలూరు | 12 |
| విశ్వాసంలో ... | కొడవటికంటి | 14 |
| క్రీ॥శే॥వై.యస్.చిన్నకొండా రెడ్డి | శ్రీ.వై.యస్.ప్రకాశ్ రెడ్డి , పులివెందుల | 18 |
| సాక్ష్యము | శ్రీమతి శారా అబ్రాహాము , కాకినాడ | 20 |
| వాక్యంలోని వనితలు | శ్రీమతి మెర్సీ ఇశ్రాయేలు | 21 |
| మనుష్యులు దేనివలన... | లియో టాల్స్టాయ్ | 22 |
| ప్రవక్తయైన యెహెజ్కేలు | కొడవటికంటి | 27 |
| యేసుకథ | కొడవటికంటి | 28 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001

**9866716506**


**సంవత్సర కానుక : రూ. 200/-**

**ప్రియపాఠకులారా మీరు పంపే కానుక 500/- మించినప్పడే ఆన్‌లైన్‌లో వేయండి.**

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : **10957294362**

బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అకౌంట్ హోల్డర్ : కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు సెల్ : 9866716506

# జీవనమంతయు...



ఐదు సంవత్సరాల క్రితం మాకు జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్‌గా డా॥ సోనార్‌బాబుగారు వచ్చారు. ఆయన భార్య డా॥ ప్రభావతిగారు దర్శిలో సంతోష్ హాస్పిటల్ నడిపిస్తున్నారని తెలిసి – వారికి హన్నాకృప ప్రతినెల పోస్టులో పంపించాను. సంవత్సరం గడిచిన తర్వాత వారిని చూడటానికి దర్శి వెళ్ళాను. ఆమె ఓ వెయ్యి రూపాయలు పత్రిక చందా ఇచ్చారు. నేను ఆశ్చర్యపోయాను. వారిని చూడటం ఇదే ప్రథమం. వెయ్యి ఎందుకు ఇచ్చారు? రెండవ సంవత్సరం మూడవ సంవత్సరం కూడా... అలా ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయలు ఇచ్చారు.

తమ తల్లిదండ్రులు సంతోషమ్మ, మోషేగారలకు వీరు అయిదుగురు ఆడపిల్లల సంతానము. వారిద్దరు ఎలిమెంటరీ టీచర్లు. ప్రభావతిగారిని మీ ఆత్మీయజీవితానికి, దాతృత్వానికి కారణం ఎవరు? అన్నాను. ఎందుకంటే ఆ అయుదుగురు అక్కచెల్లెలు గొప్ప విశ్వాసజీవితాలు గడుపు చున్నారు. నేను సేకరించి ప్రచురించిన అనేక సాక్ష్యాలలో వీరి పేర్లు వినపించేవి. అందుకు ఆమె “మా తల్లిగారు – మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే మనిషికి ఒక చిన్న డబ్బా ఇచ్చి, మా చేతికి వచ్చిన డబ్బులు దశమభాగం తీసి వెయ్యాలి అని చెప్పింది”ని చెప్పారు.

ఆ విధముగా దశమభాగము తీయుట తన బిడ్డలకు సంతోషమ్మగారు నేర్పించి, తన 41 సంవత్సరం లోనే వారిని దేవుడు గొప్ప స్థితిలో ఉంచారు. జయప్రద, ప్రభావతిగార్లు డాక్టర్స్ అయ్యారు. పరిశుద్ధమ్మ టీచర్‌గా రిటైరై రెవ.డి.వి.కృపాకరరావుగారి భార్యగా గొప్ప సేవ చేస్తున్నారు. అందరు గొప్ప సంపాదకులయినా దేవుని సేవను గొప్ప ఆత్మబలముతో చేస్తున్నారు.

ఒకవేళ సంతోషమ్మగారు ఈ లోకసంబంధమైన ధనమును సంపాదించి బిడ్డలకిచ్చినా వారికి ఆశీర్వాద కరమైన దీవెనగా ఉండేదికాదు. ఈ మధ్యకాలములో ప్రకాశంజిల్లాలో రాణింగవరం అనే గ్రామము నేషనల్ హైవేకి దూరంగా ఉండేది. కొద్దికాలం క్రితం ఆ గ్రామమంతా కదిలి రోడ్డు దగ్గరగా వచ్చారు. బస్‌దిగి నేను ఆ గ్రామములో నడుస్తున్నాను. రైతుల ఇండ్ల మధ్యగా వెళ్తుంటే ప్రతి ఇంటి మీద ఓ సొరచెట్టు కాయలు కాచివున్నాయి. ఆ ఇల్లు దాటిలోపలికి వెళ్తే అక్కడ ఏ ఇంటిముందు కాని, పైనకాని కూరచెట్లు లేవు.

జ్ఞానవంతురాలు తన ఇంటిముందు నాలుగు కూరవిత్తనాలు నాటి వాటి ఫలము అనుభవిస్తున్నది. యేసు ప్రభువు ‘భూమిమీద మీకొరకు ధనము కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయైనను తుప్పైనను తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి’ అని చెప్పారు. దీనికి మనము ఆత్మీయఅర్థాలు తీయనవసరం లేదు. ఆయన చెప్పింది చెయ్యటమే మనపని. డబ్బులు రేపటికోసం ఇక్కడ బ్యాంకులో వేసుకో...

మహాగొప్ప విశ్వాసి అయినా ఎంత ఎక్కువ బ్యాంకు బ్యాలెన్స్ ఉంటే అంత సంతోషంగా ఉంటాడు. ఏదో కొద్దిగా బ్యాంకులో ఉంటే దాన్ని ఇంకొంచెం పెద్దది చెయ్యాలని చూస్తారు. అసలు బ్యాంక్‌లో ఏమి డిపాజిట్టు లేని విశ్వాసి ఏంచేస్తాడు? తనకు రాబోయే అపాయాల గురించి డబ్బు అవసరతలగురించి దేవుని వైపు చూస్తాడు. మనం డబ్బులు బ్యాంకులో వేసుకొన్నప్పుడే ధైర్యంగా బ్యాంకుకి వెళ్ళి డబ్బు డ్రా చేస్తాము. ఇందులో ఇసుమంత అయినా అనుమానము లేకుండా వెళ్తాము. ప్రభువు తన బ్యాంకులో మీ డబ్బులు దాచుకోమంటున్నాడు. ఇంటి ముందు ఒక అంగుళం గుంటతీసి బ్రతికివున్న విత్తనాన్ని దాంట్లో దాచిపెట్టమన్నాడు. అంతకు వందరెట్లు విత్తనాలు ఆ గుంటనుండే తీసుకొంటున్నాము.

ఇంటిమీదకు సొరచెట్టును పాకించిన ఓ తల్లి – ఆమె తల్లి దగ్గర ఈ విషయం నేర్చుకుని తన ఇంటిమీద కూరగాయలు పండించారు. డాక్టరు ప్రభావతిగారి

**తరువాయిభాగం 17వ పేజీలో**

# విలియం కేరి - మహనీయ జీవితం



రచన – ఆంద్రూస్ దావల

పైగా కలకత్తా నగరాన్నేకాకుండా యావత్ బెంగాల్ రాష్ట్రాన్ని మరెవరికీ కాలుమోపే అవకాశాన్నివ్వ కుండా ఈస్టిండియాకంపెనీవారు కావులించు క్కూర్చున్నారు. పరదేశీయులకెవరికీ ప్రవేశం లేకుండా కాపలా కాస్తున్నారు.

నేనూ, నా పరిచర్య వారి దృష్టిలో నిషిద్ధం. మావి విభిన్న ధృవాలు. వారు ఇహలోక రాజ్యవిస్తరణకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటే, నేను పరలోక రాజ్యవిస్తరణకు ఉద్యమించబోతున్నాను. మనదేశం నుండి బొత్తిగా ఆర్థిక సహాయం ఉండదని నీకు తెలియని విషయమేమీ కాదు. పరిస్థితులిలా ఊహలకందకుండా ఉంటే, మనం కాలుమోప బోతున్న పరదేశంలో మనకందబోయే సహాయ సహకారాలు మృత్యమనేది సత్యదూరం కాదు. మన దగ్గరున్న కొద్ది మొత్తాన్ని ప్రాణప్రదంగా పొదుపు చేసుకోకుంటే భవిష్యత్తు ఘోరంగా ఉంటుందని నా భయం. మనం ఈనాడు వృథా చేసే ప్రతి పైసా విషయంలో మరునాడు పశ్చాత్తాప పడవలసి వస్తుంది. ఎందుకు నేను గీచి గీచి ఖర్చుపెడుతున్నానో మీకీపాటికి అర్థమయ్యే ఉంటుంది. అందుకు సరిపడ్డా జవాబు కూడా మీకిచ్చాను" అంటూ చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటున్నాడు.

ఇదే ఆసరాగా తీసుకొని, డోరతి వారి దగ్గరికొచ్చి, వారి సంభాషణలో కలిగించుకోవడానికి ప్రయత్నిస్తూ "చూస్తున్నారుగా అన్నయ్యా! ఆయన గుండెల్లోని గుబులు. ఆయన కోణంలోంచి చూసినా మా కుటుంబ భవిష్యత్తు అంధకారమే! ఊహలక్కూడా అందని అయోమయం. ఉన్నపళంగా ఆయన పరిస్థితే అంచనాలకు అందకుండా ఉంటే, అన్నిటికీ ఆయనమీద ఆధారపడి బ్రతుకు వెళ్ళబోసు కుంటున్న మా గతేమిటి? ఇంగ్లాండులో ఉన్నప్పుడే మా బ్రతుకులు బండలయ్యాయి. ముప్పూటా తిన్న రోజుల్ని వ్రేళ్ళపై లెక్కించుకోవచ్చు. అక్కడలేని సుఖసౌకర్యాలేవో మేమెన్నడూ ఎరుగని విదేశంలో సమకూర్చి పెడదామని ఈయన ప్రయాణంకట్టాడని అనుకుందామా? పోనీ, పోయేది పరదేశం. ఒక సుస్థిరమైన ఉపాధి, ఉద్యోగం, వృత్తి ఏర్పరచుకొని వెళ్తున్నామా? ఆయన అంతరంగానికి మినహా మరెవరూ ఎరుగని, ఎవరికీ అంతుచిక్కని, అదేదో దేవునిసేవ అంటూ అందర్నీ బయలుదేరదీశాడు. కూటికీ, గుడ్డకు గాని సేవలుచేస్తూ కూర్చుంటే ఒళ్ళు హూనం చేసుకోవడం తప్పితే తనకూ, తన కుటుంబానికి ఆ సేవనేది ఆటి వస్తుందనే నమ్మకం కనీసం ఆయనకైనా ఉందను కుంటారా? ఒక కొత్త దేశానికి, ఎన్నడూ చూసెరుగని ఒక పరాయి దేశానికి కుటుంబాన్ని తరలించుకు పోతున్నాడంటే ముందుగా బ్రతుకుదెరువుకు ఒక ప్లానంటూ ఉండాలిగా? అంతా దేవునిదే భారం. ఆయనే సర్వం సర్దుబాటు చేస్తాడను కుంటే మాది గుడ్డివాడి ప్రయాణమేగా?

పనికిమాలిన పనులన్నీ తలకెత్తుకుంటే కనుపించే మనుషులే సహకరించరు. ఇక కంటికి కనిపించని ఆ దేవుణ్ణి నమ్ముకుంటే..." అంటూ డోరతి సాగిపోతుంటే, గుండెల్ని పిండి అక్కసు గుమ్మరిస్తుంటే, కోపానికి బదులు థామస్‌కు నవ్వొచ్చింది. "మరీ చిన్నపిల్లలా మాట్లాడుతున్నావు చెల్లీ! కేరిని, ఆయన తలపెట్టిన మహత్తర ఉద్యమాన్ని గురించి అపార్థం చేసుకుని, అపోహలకు తావిస్తున్నావు. అదంతా నీ అజ్ఞాన మని అనలేనుగాని అమాయకత్వమనుకోవచ్చు" అంటూ కొద్దిసేపు మౌనంగా ఉండి, ఆలోచనలో పడిపోయాడు థామస్. వారిద్దరి వాదన ఆలకిస్తున్న కేరి అసహనంగా కదుల్తున్నాడు. అయినా అతని పెదవులపైన తాండవిస్తున్న చిరునవ్వు ఉపశమించలేదు. థామస్, పైకిలేచి గదిలో పచార్లు చేస్తూ, మరలా సంభాషణ పొడిగించాడు.

"దైవనిర్ణయాలు, సూటిగా మానవమేధస్సుకు అంతుపట్టడం అరుదు. ఊహలకందని విషయాలు లీలగా, దైవావేశంగా రూపులెత్తి, ఆయన బిడ్డలయిన వారికి కర్తవ్యం బోధించి, కార్యసాధనకు పురికొల్పుతాయి. సాహసవీరులు, మనోబల సంపన్నులు మాత్రమే స్ఫూర్తిదాయకంగా కర్తవ్య దిశవైపు కదుల్తారు. ఆయన వారికి సాక్షాత్కరింపజేసే పథకాలకు కార్యసిద్ధి చేకూరుస్తారు" అంటూ మరో ప్రపంచం లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నట్టుంది థామస్ ధోరణి. ఆయన పలువరించేదంతా మిద్యావాదంగా భావించు కుందేమో డోరతి, అటువేపు తిరిగి వెటకారంగా నవ్వుకుంది.

కాని, ఆ వెటకారంలోంచి అవతరించిన ఉక్రోషాన్ని మాత్రం ఆమె దాచుకోలేక పోయింది. అది గమనించిన థామస్ – "నా వాదన అవాస్తవంగా అనిపించినా అంత తేలిగ్గా కొట్టేసేది మాత్రం కాదుచెల్లీ" అన్నాడు. ఆమె తీవ్రస్థాయిలోనే ఆలకిస్తూ ఉందని నిర్ధారణ చేసుకున్నాక మరలా మొదలు పెట్టాడు థామస్.

"తన బ్రతుకు బాటతీరేమిటో, గమ్యమేమిటో ఊహించుకోవడం కూడా చేతకాకుండా గొర్రెలు కాసు కుంటూ, చెట్లూ, పుట్టలు పట్టుకు తిరిగే తనను యూదా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకే యెహోవా దేవుడు ఎంచు కుంటాడని దావీదుకు ముందుగా తెలుసా? దైవ నిర్ణయానికి తలొగ్గి బయలుదేరాడు. అలా సంసిద్ధుడైన దావీదు యూదా సామ్రాజ్యానికే అధినేతయ్యాడు. ప్రభువైన క్రీస్తు వంశానికే మూలపురుషుడయ్యాడు. పరదేశంలో బానిసబ్రతుకుల్తో, వెట్టి చాకిరితో బంధీలైయున్న వేలాది యూదుల్ని దాస్య విముక్తుల్నిచేసి, కానానుదేశానికి నడిపించేందుకు నాయకత్వం వహించమని, మాటతీరైనా సరిగాలేని నత్తివారైన మోషేను దేవుడు ఆదేశించాడు. తటపటా యించినా దైవాదేశాన్ని తిరస్కరించ కుండా ఒక జాతిగా యూదుల్ని కూడగట్టుకుని, కానాను వైపు బయలుదేరాడు. ఆ బానిసలే మరోనాటికి బలవత్తరమైన యూదా జనాంగంగా ప్రసిద్ధులయ్యారు. వారిలోనుంచి లోక రక్షకుడైన యేసుస్వామి అవతరించాడు. అంతటి మహత్తర భవిష్యత్తును ముందుగానే మోషే ఊహించుకున్నాడా?

మహారణలెందరెందరు లేరు? ప్రసిద్ధ కుటుంబా లకు చెందిన స్త్రీలందరినీ కాదని, ఎన్నుకున్న పేదింటి కన్య మేరీకి ముందుగా తెలుసా మహనీయమూర్తి క్రీస్తుకు తల్లినవుతానని? యెహోవా దేవునికి కావలసింది – వ్యక్తిపరిపూర్ణత, వ్యక్తి సామర్థ్యం, వ్యక్తి అంకితభావం. అంతేగాని, వ్యక్తి స్థాయి, వ్యక్తి నేపథ్యం అక్కరలేనివి. అక్కరకు రానివి.

ఎంపికక్షణాన వారు సామాన్య వ్యక్తులే కావచ్చు. కాని, ఆ దేవునికే తెలుసు ముున్ముందు వారు వ్యవస్థలుగా పరిణమిస్తారని. అలాగే కేరికి ఒక మహత్తర బాధ్యతను ప్రభువు అప్పగించబోతున్నాడు. అది వారిద్దరికే తెలిసిన రహస్యం. అది వారికే పరిమితమైన సమస్య. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆ పరమతండ్రి పెట్టిన పరీక్షలో విలియం కేరి నెగ్గాడేమో! అదంతా మనకు తెలియని విషయం" అంటూ లేచి వెళ్ళడానికి డా॥ థామస్ ఆయత్తమవుతుంటే ఆయోమయంలో పడిపోయిన డోరతి నిదానంగా తలుపు దాకా వెళ్ళి సాగనంపింది. ఎటూతేలని నిర్ణయాలు – అంచులు కనిపించక అల్లాడుతుంటే, తిరిగొచ్చి డోరతి ఒక కుర్చీలో కూలబడి కేరి వైపు అయోమయంగా చూస్తూ కూర్చుంది.

✦ ✦ ✦

వారం దినాలుగా పట్టి పీడించిన జ్వరం కేరిని విడిచిపోయాక దానితో పాటే ఆయన నావరించిన నైరాశ్య భావనలు కూడా అంతరించాయి. ఆహారవిషయాల్లో పూర్తిగా నిర్లక్ష్యంచేయడం మూలాన నీరసమింకా ఆయన్నంటి పెట్టుకుని ఉంది. సాయంత్రం అయిదు గంటలకు కేరి పడకపై నుంచి లేచేటప్పటికి డోరతి టీకప్పు తెచ్చి చేతి కందించింది. టీ గొంతులో నుంచి కిందకు దిగుతుంటే శరీరమంతా వెచ్చబడుతున్నట్టు, జవసత్వాలు పుంజుకున్నట్ట నిపించింది. కేరికి తానింక రోగినన్న ధ్యాస పటాపంచ లయింది. ఇక పడక నంటిపెట్టుకుని గదిలో పడుకోబుద్ధి కాలేదు. డోరతి వద్దని వారిస్తున్నా పాత అలవాటు ప్రకారం ఓడ పై భాగానికి వెళ్ళిపోయాడు.

చుట్టూ ఎటుచూసినా సముద్రపు అనంతాలు. ప్రకృతి ఆలనాపాలనా తన బాధ్యతేనన్నట్టు భూగోళానికి గొడుగు పట్టుక్కూర్చుంది ఆకాశ విస్తారం. జన్మతః విలియం కేరి ప్రకృతి ఆరాధికుడు. ప్రకృతికి మానవుడే యజమానైతే, ప్రకృతి ఒడిలోని పసిపాప ఈ లఘుప్రాణి అని దృఢంగా నమ్మేవాడు. ప్రత్యేకించి సముద్రమంటే కేరికి విపరీత వ్యామోహం. దర్శించే అవకాశం లభిస్తే ఏనాడూ చేజార్చు కోలేదు. సముద్రానికభిముఖంగా నిలబడి తనను సముద్రం తో బేరీజువేసుకుని చూసుకునేవాడు. సముద్రం ఈనాటిదా? ప్రకృతినీ, ప్రపంచాన్నేలిన సుప్రసిద్ధ మానవు లెందరు చరిత్రలో గతించలేదు. అది మాత్రం శాశ్వతంగా దేవుని మహత్తర సృష్టికి గంభీరప్రతీకగా అలాగే శాశ్వతమయింది.

**(సశేషం)**

సాక్ష్యము

# సీనియారిటి ప్రభువు నాకిచ్చాడు

నిమ్మగడ్డ సుధీర్, హైదరాబాద్

**మా అమ్మ** నన్ను సాయిబాబాకు గొప్ప సేవకునిగా చెయ్యాలనుకునేది. నేను ఒక్కడినే సంతానము. విశ్వ బ్రాహ్మణ కులము. నా పేరు నిమ్మగడ్డ సుధీర్. ఏడవ తరగతి నుండి ఎప్పుడైనా సైకిల్‌మీద వెళ్ళేటప్పుడు స్నేహితులు ప్రక్కన లేకపోతే దేవుని వాక్యము ఎక్కడనుంచైనా నా చెవినపడితే అది వింటుండేవాడిని. ఆ చెప్పే ఆయనకాని ఏదైనా పిట్టకథలు మధ్యలో చెప్తుంటే వెళ్ళిపోయేవాడ్ని.

నేను ఇంటరు పాసైన తర్వాత వేటపాళెంలో గవర్నమెంటువారి ఉచిత టెక్నికల్ శిక్షణాలయములో ఎలక్ట్రికల్ డిప్లొమో తీసుకొన్నాను. వేటపాళెంలో ఉన్నప్పుడు చీరాల వాస్తవ్యుడైన ఒక క్రైస్తవ విద్యార్థి నాకు పరిచయమైనాడు. అతని బంధువులు ఒంగోలులో ఒక చర్చిని నడిపిస్తున్నందున ఆ చర్చిలో ఏదైనా కరెంటుపని వుంటే నన్ను పిలుచుకొని వెళ్ళేవాడు. ఆవిధంగా చర్చిలో అడుగుపెట్టి వారితో పరిచయం పెరిగింది. అయితే వాళ్ళెవరు నాకు యేసును గురించి చెప్పేవారుకాదు. కనీసం ప్రార్ధనకు రమ్మని కూడా పిలువలేదు.

నా మేనమామ ఒంగోలులో పనిచేస్తున్నాడు. ఆయనకు మానసికవ్యాధి వచ్చింది. మంత్రాలు తంత్రాలు చేయించారు. ఆయన నన్ను ఆయన తరపున అనేకమైన అన్యుల దేవాలయాలకు పంపి, అర్చనలు చేయించేవాడు. నేను వెళ్ళేవాడిని, కాని ఫలితం లేకపోయింది. వారి ఇంటి ప్రక్కన ఉన్న ఓ క్రైస్తవురాలు ఆయనకు "యేసును నమ్ముకో, నీకు పట్టిన దెయ్యం వదులుతుంది" అని చెప్పినందువలన ఆయనకు మనస్సులో నమ్మకం లేకపోయినా, నన్ను వెంట బెట్టుకొని చర్చికి వెళ్తుండేవాడు. అప్పుడు నేను కూడా దేవుని వాక్యం వినేవాడిని. కొన్నాళ్ళు చర్చికి వెళ్ళిన మా మామ, తర్వాత వెళ్ళటం మానేశాడు.

నాకు పరిచయమైనవారు 'హన్నాకృప'ను ఇచ్చారు. అది నేను మా మామ ఇంటికి తీసుకొనివెళ్తే ఆయన "ఇంటికి ఎందుకు తెచ్చావు? కావాలంటే మీ ఇంటికి తీసుకొని వెళ్ళు" అన్నాడు. మా అమ్మ ఆ పుస్తకము చూసి ఏమి అనలేదు. యేసు కూడా అందరి దేవుళ్ళలో ఒకడు మాత్రమే అని ఆమె నమ్మకము. హన్నాకృపను ప్రతినెల అంతా చదివేవాడ్ని. వారి ఇంటిలో ఏదైనా కరెంటుపని అవసరానికి నన్ను పిలిచేవారు. నాకు వారితో బాగా పరిచయము ఏర్పడింది.

అప్పుడు నాలో అనేకరకమైన ఆలోచనలు కలుగు చుండేవి. దేవుళ్ళు అనబడే వారందరి గురించి ఆలోచిస్తుండే వాడ్ని. కానీ యేసును గురించిన మాటలువింటే నా హృదయం లో నెమ్మది కలిగేది. యేసు హృదయానికి సంబంధించినవాడు అనే నమ్మకం కలిగింది. ఒక సంవత్సరం నుండి యేసుప్రభువు తప్పితే మరెవరు ఆత్మీయదైవం లేదు అనే నమ్మకము కలిగింది. ప్రతి ఆదివారం తప్పకుండా ప్రభువు నడిపించిన ప్రార్ధన మందిరమునకు వెళ్ళటం మొదలుపెట్టాను. యేసు ప్రభువుకు ప్రార్ధన చెయ్యటం ప్రారంభించాను. ఆయనకు సంబంధించిన పుస్తకాలు నాకు హన్నాకృపవాళ్ళు ఇచ్చేవారు. ఒక బైబిలును కొని, చదవటం ప్రారంభించాను. ఆయన నా రక్షకుడని ఆయనమీద ఆధారపడి జీవించసాగాను.

నేను బి.యస్.సి. ఫైనలియర్‌కి వచ్చాను. నా తీరికవేళలో కరెంటుపని చేస్తూ, ప్రార్ధనలకు వెళ్తూవున్నా, అన్ని పరీక్షలలో ఉత్తీర్ణుడనవుతూవున్నాను. ఫైనల్ ఇయర్‌లో రికార్డ్సుమీద సంతకం చేయించుకోవడం ఒక ముఖ్యమైన మైలు రాయి. మాస్టారు అంతంత మాత్రంగానే సంతకాలు చేస్తారు. ఆయనకి ఇష్టమయినవారికే చేస్తారు. ఎలా? అని ఒక దైవజనుని అడిగాను. "నువ్వు యేసయ్యను అడుగు(ప్రార్ధించు) నేను కూడా నీ కోసం ప్రార్ధనచేస్తాను" అన్నాడు.

రెండవరోజు నేను రికార్డు తీసుకొని మాస్టారు దగ్గరకు వెళ్తున్నాను. ఆయన గదిబయట నిలుచుని "ప్రభువా! మాస్టారు రికార్డు మీద సంతకము చేసేటట్లు చెయ్యి" అని ప్రార్ధించుకుంటున్నాను. అంతలో ఒక లెక్చరరు నా దగ్గరకు వచ్చి "సుధీర్! నువ్వు బజారు వెళ్ళి పనిచేసుకొనిరా!" అని ఒక పని చెప్పి, నా చేతిలోని రికార్డు పుస్తకం తీసుకున్నాడు. నేను "ప్రభువా! రికార్డు పుస్తకం సంతకము చేయించు కోవటానికి ఇదే ఆఖరిరోజు ఎలా?" అని ప్రార్ధించుకొంటూ బజారు వెళ్ళి వస్తూ "సంతకము చేసే మాస్టారు ఇంకా ఆయన సీటులో ఉండేటట్లు, నేను సంతకము చేయించుకొనేటట్లు కృప చూపు" అని ప్రార్ధించుకొంటూ కాలేజి వద్దకు వచ్చాను.

నా రికార్డు తీసుకొనిన మాస్టారుకి బజారుపని పూర్తయిందని చెప్పి, ఆయన చేతిలోని నా రికార్డు పుస్తకం తీసుకొని మాస్టారు వద్దకు వెళ్తూ తెరచిచూశాను. రికార్డుల్లో అన్ని సంతకాలు పెట్టబడి ఉన్నాయి. ప్రభువు నామమునకు నా హృదయంలో కృతజ్ఞతలు చెల్లించి, వెంటనే ప్రభువు చేసిన ఈ ఆశ్చర్యకార్యమును నా కొరకు ప్రార్థించుచున్న పాస్టరు గారికి ఫోను చేసి చెప్పాను.

ఆరోజు 19-2-2006 ఆదివారం. ఏ చర్చికి వెళ్ళాలి? అని ఆలోచిస్తూ నడుస్తున్నాను. తలెత్తి చూశాను. నేను ఒక ప్రార్ధన మందిరం ఎదుటవున్నాను. లోనికివెళ్ళి కూర్చున్నాను. ఇంతకుముందు ఏదైనా మందిరము (చర్చి) లోనికి వెళ్తే అక్కడ ఉన్నవారంతా రెండు చేతులు పైకి ఎత్తితే, నేను ఎత్తేవాడిని కాదు. సిగ్గుపడేవాడిని. కానీ ఈ రోజు నా రెండుచేతులు పైకెత్తకుండా ఉండలేకపోయాను. ఈ రెండు చేతులు నాకిచ్చినది ఆ యేసయ్యే కదా! అని నా రెండు చేతులు పైకెత్తి యేసయ్యను ఆరాధించాను.

నేను టెన్త్‌క్లాస్ చదివేటప్పుడు బాగా చదివేవారికన్నా తక్కువ చదివేరకం స్టూడెంట్‌ని. 59శాతం మార్కులు వచ్చేవి. 2000ఇంటర్‌లో 49శాతం మార్కులతో ఫస్టియర్ ఇంటర్‌లోని ఆరు సబ్జెక్టులలో - మార్చిలో మూడు పాసయ్యాను. సప్లిమెంటరీలో మూడువ్రాసాను. అవి మూడు, సెకెండ్ ఇయర్ ఆరు - మొత్తం తొమ్మిది సబ్జెక్టు. సెకెండియర్ మార్చిలో నేను వ్రాయాలి. మరలా తొమ్మిదింటిలో అయిదు పాసయ్యాను. నాలుగు మిగిలాయి. మరలా సెకెండియర్ సప్లిమెంటరీలో నాలుగు వ్రాస్తే రెండే పాసయ్యాను. అంటే ఇంకా రెండు మిగిలివున్నాయి. ఇప్పుడు ఒక సంవత్సరం వృధా అయింది. రెండు వ్రాస్తే ఒకటి పాసయ్యాను. మరలా సప్లిమెంటరీలో ఆ ఒకటి పాసయ్యాను. వెంటనే మా సొంతవూరు ఒంగోలులో డిగ్రీలో చేరాను.

2003 చూస్తే జూనియర్స్ నాకు క్లాస్‌మేట్స్ అయ్యారు. 2003 నుండి 2006 వరకు నా డిగ్రీ కంప్లీట్ అయింది. వెంటనే యం.సి.ఎ.లో చేరాలనుకున్నాను. కాని ఇక్కడ లక్షల్లో అడుగుతున్నారు. అది కట్టలేక, వసతిలేక ఒక సంవత్సరం వృధా అయినందున ఒకప్పటి నా జూనియర్స్ నాతో సమానమయివారు నాకు సీనియర్స్ అయ్యారు. ఈ విషయం నాకు చాలా బాధాకరంగా ఉండేది.

2007 నుండి 2010 వరకు తమిళనాడులో యం.సి.ఎ.లో చేరాను. యం.సి.ఎ. కంప్లీట్ కాకమునుపే నా ఫైనల్ ఇయర్‌లో ప్రాజక్టు కోసం హైదరాబాదు వచ్చాను. నా ప్రాజక్టు పూర్తికాకముందే నాకు ఉద్యోగం రావాలని ప్రార్థించుకొనేవాణ్ని. ఇంకా వారంలో తమిళనాడు కాలేజీలో నా ప్రాజక్టు సబ్‌మిట్ చేయవలసివుండగా, ఇక నా జాబ్ కోసమైన నా కోరిక నెరవేరదు అనుకొని హైదరాబాద్ నుండి బయలుదేరి నా స్వగ్రామమైన ఒంగోలు వచ్చాను. అప్పుడు నేను అస్వస్థుడనై ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేరాను. రెండు రోజులకే స్వస్థత వచ్చింది. హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళాను. ఇంకా మూడురోజులలో ప్రాజక్టు సబ్‌మిట్ చేయవలసి ఉంది. తమిళనాడు వెళ్ళవలసియుండగా ఆరాత్రే 11గంటలకు హైదరాబాదులోని నా స్నేహితుడు ఫోన్ చేసి తెల్లవారితే హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకి హాజరుకావాలని చెప్పాడు. నా ఆరోగ్యం దృష్ట్యా నా తల్లిదండ్రులు నేను వెళ్ళుటకు ఒప్పుకోలేదు. వారికి ఒప్పించి అప్పటికప్పుడే బయలుదేరి హైదరాబాద్ వెళ్ళాను.

ఆ ఇంటర్వ్యూలో ఒకప్పుడు నా జూనియర్స్‌గా ఉండి సీనియర్సుగా మారిన వారితో కలిసి జరిగింది. 2010 యం.సి.ఎ. బాచ్‌లో నన్ను ఒక్కడిని, మే 2009 బాచ్‌లో ఇద్దరిని సెలక్టు చేసుకున్నారు. అంటే నా సీనియర్లు కొందరిని సెలక్టు చేసుకున్నారు. మేము డ్యూటీకి హాజరువుతున్నాము. ట్రైనింగ్‌లో నా పర్‌ఫార్మెన్స్‌చూచి నాతోచేరిన (సీనియర్సు) వారందరిలో నన్ను టీం లీడరుగా చేశారు. ఇప్పుడు పూర్వం నేను పోగొట్టుకొనిన సీనియారిటీ మరలా ప్రభువు నాకిచ్చాడు అని తెలుసుకున్నాను.

ఒకప్పుడు 'నా జూనియర్స్ నాకు సీనియర్స్ అయ్యారు' అని బాధపడేవాడిని, బాధపడ్డాను. కాని నేనెన్నడు ప్రభువును అడుగలేదు. నా హృదయం ఎరిగిన ప్రభువుకృపతో నేను ఉండవలసిన స్థితికంటే ఉన్నత స్థానమునకు నన్ను చేర్చాడని తెలుసుకొని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాను.

నాకు ఊహతెలిసి ఇప్పటికి 20 సంవత్సరాలు గడిచినవి. అంటే నా జీవితంలో యేసయ్యను ఎరుగక ఇంతకాలము నా జీవితం వృధా అయింది కదా! అనే బాధ కలిగింది. **నేను బాప్తీస్మము తీసుకొని యేసయ్య సేవకుడను అయ్యేటట్లు మీరందరు నా కొరకు ప్రార్ధన చెయ్యండి.**

**(సమాప్తం)**

# ఫాదర్ హయ్యర్ (1793 - 1873)

**(ఆంధ్రలో సేవ 1842 - 1871)**

'మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి' (మార్కు 16:16) అను ఆజ్ఞను శిరసావహించి 12,000 మైళ్ళ దూరమున వున్న భారతదేశములోని ఆంధ్ర ప్రాంతమునకు 1842లో మొదటి లూథరన్ క్రైస్తవ మిషనరీగా అరుదెంచినాడు హయ్యరుగారు. తెలుగువారి మధ్య గుంటూరు, గురజాల, పల్నాడు, రాజమండ్రి నరసాపురము, ఆగర్తిపాలెము మొదలగు ప్రాంతములలో సేవచేయుట ఒక అమెరికన్ లూథరన్ మిషనరీకి చాలా సాహసోపేతమైన కార్యము. ఆనాటి పరిస్థితులను, అష్ట కష్టాలను ఓర్చుకున్నాడు 'తండ్రి హయ్యరు'. ఈ యాత్రికుని ఇంతదూరము నడిపించిన ఆ నక్షత్రము యేసుక్రీస్తే! సౌకర్యములు లేవు, ప్రజల సహకారములేదు. అయినా క్రీస్తు ప్రభువు సిలువ మోయుటకు సిద్ధమై వచ్చినాడు. విశ్వాసము, ప్రేమ, విధేయతలతో తన కర్తవ్యాన్ని నెరవేర్చినాడు.

భాషవేరు, ఆహార పానీయములలో తేడా, వాతావరణము మార్పు, దేశముకాని దేశములో సేవ చేయుటకు తల్లిలేని చిన్నబిడ్డలను, బంధువులను, స్నేహితులను వదలి తెలుగు (ఆంధ్ర) దేశములో క్రీస్తు రాజ్యమును స్థాపించి, విస్తరింపచేయవలెనని నడుము కట్టుకొని, సాహసోపేతంగాను, ఒంటరిగాను పోరాడిన క్రీస్తు యేసుని యోధుడు - జాన్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ హయ్యరు. 'నేను నాటితిని, అపోల్లో నీళ్ళు పోసెను, వృద్ధి కలుగజేసినవాడు దేవుడు' 1కొరింథి 3:6. జర్మనీలో పుట్టినాడు, అమెరికాలో పెరిగినాడు, ఇండియాలో మిక్కిలి జ్ఞాపక ముంచుకోదగిన సేవచేశాడు. ఆయన విశ్వమంతటికి చెందిన పౌరుడు. ఆయనలోని విశ్వాసపటిమ, ఆయన సేవ యొక్క విలువ, ఆయన మూర్తిమయములోని హుందాతనమును శ్లాఘించిన తన సహచరులు ఆయనను 'తండ్రి హయ్యరు' అను విశిష్టమైన లేక అద్వితీయమైన బిరుదుతో ఘనపరచినారు. తన సేవాదినములు పూర్తయగుచున్న వృద్ధాప్యదశలో కూడ సువార్తను ప్రకటించవలయుననే తపన కలిగిన వ్యక్తి. కారణం? భక్తిగల తల్లిదండ్రుల పెంపకము అట్టిది. గన్ కాంపౌండులోని దేవాలయమునకు తూర్పు భాగమున హయ్యరు స్మారకచిహ్నము పాలరాతితో నిర్మింపబడినది. ఈ దేవాలయము (పాత గుడియని పిలువబడుచున్నది) ఆంధ్ర సువిశేష లూథరన్ సంఘము యొక్క ప్రప్రథమ దేవాలయము. ఆ పాలరాతిపీఠముపై తెరువబడిన బైబిలు, దానిమీద యీ వాక్యములు వ్రాయబడియున్నవి.

'నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది' (కీర్త 119:115)

'నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నాద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు.' (యోహాను 14:6)

ఈ పీఠము చుట్టు ఇనుప కటకటాలు అమర్చబడినవి. ఫాదరు హయ్యరుగారు ఉపయోగించిన (కూర్చుండి యున్న) చెక్కకుర్చీ నేటికిని ఈ ప్రప్రథమ లూథరన్ దేవాలయములో భద్రపరచబడియున్నది. ఈ దేవాలయ నిర్మాణమునకు శ్రీమతి ఎమ్మా బి. స్టార్క్ అధికవ్యయమును భరించిన దగుటచే స్టార్క్ గారి పేరు హయ్యరు గారి పేరుతో కలిపిరి. కనుక ఇది స్టార్క్ - హయ్యరు జ్ఞాపకార్థ పరి.మత్తయి లూథరన్ దేవాలయముగ ప్రసిద్ధికెక్కినది. గుంటూరునకు వచ్చిపోయే విదేశ, స్వదేశ లూథరన్, ఇతర మిషనరీలు ఎవరైనా ఈ ప్రప్రథమ లూథరన్ దేవాలయమును, ఆయన ఉపయోగించిన కుర్చీని, ఈ స్మారక చిహ్నమును దర్శించి, హయ్యరుగారికి శ్రద్ధాంజలి ఘటించకుండా తిరిగివెళ్ళరు.

'నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును.' (సామె 10:7) ఆంధ్ర సువిశేష లూథరన్ సంఘ స్థాపకునిగా హయ్యరుగారు చేసిన సేవలను స్మరించుకొనుచు, ఆయన గుంటూరులో తొలి అడుగిడిన రోజు అనగా జూలై 31ని, ప్రతి సంవత్సరము 'సువార్తదినము'గా లూథరన్ సంఘము ఆచరించుచున్నది. తూర్పు ప్యారిష్‌లోని స్టార్క్ హయ్యరు జ్ఞాపకార్థ పరి.మత్తయి

లూథరన్ దేవాలయము నుండి లూథరన్ క్రైస్తవులందరు పశ్చిమ గురుమండలములోని దేవాలయము వరకు గొప్ప ఊరేగింపుగా వచ్చెదరు. తదుపరి హయ్యరుగారి సేవలను, సంఘాభివృద్ధి జ్ఞాపకము చేయు పలు కార్యక్రమములు నిర్వహింపబడును. ఈ సందర్భముగా జరిపిన వ్రాత పరీక్షలు, వక్తృత్వపు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులిస్తారు.

## 12. ఎ.ఇ.యల్.సి. విస్తరణ, భవితవ్యము

సంఘాభివృద్ధిని పరిశీలించినచో నేడు (2008) ఆంధ్ర సువిశేష లూథరన్ సంఘములో 5000 సంఘములు, 582 ప్యారిష్‌లు, 24 హైస్కూళ్ళు, 21 కళాశాలలు, 8 ఆస్పత్రులు కలవు. చర్చి ప్రెసిడెంట్‌గారి జూలై 2008 మంత్లీ ప్లానర్ ప్రకారము రిటైర్డ్ పాస్టర్స్, 76మంది విడోపాస్టరమ్మలు కలరు. రాష్ట్రమంతటిలో 650 మంది పాస్టర్స్ పనిచేయు చున్నారు. 2 బి.ఇ.డి. కళాశాలలు, 1 న్యాయశాస్త్ర కళాశాల, 1 బి.యస్.సి. నర్సింగ్, 1 వయోవృద్ధులు ఆశ్రమం, 1 కుష్టువ్యాధిగ్రస్తుల వైద్యశాల, 78 ఉమెన్‌వింగ్‌లు, 2 ఆశ్రమములు, 12 సువార్తసేవికలు, 2 వేదాంతవిద్య కళాశాలలు, 12 కె.యన్.హెచ్. హాస్టళ్ళు (2.500 అనాధులు), 6024 లూథరన్ చర్చి బిల్డింగ్‌లు కలిగి గొప్ప సేవచేయుచున్నది ఎ.ఇ.యల్.సి.

పరిపాలనా సౌలభ్యత కొరకు యావత్ సంఘము 6 సినడ్‌లుగా విభజించబడినది. మొత్తము సంఘమును పరిపాలించుటకు 24 మంది అభిషక్త, అనభిషక్త సభ్యులతో కూడిన కార్యనిర్వహకసభ కలదు. కార్యనిర్వహక సభలో ముఖ్యులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి మరియు పరిపాలన, మెడికల్ బోర్డు, ఎవాంజిలికల్ బోర్డు, ఫైనాన్స్ బోర్డు, కాలేజి ఎడ్యుకేషన్ బోర్డు, సెకెండరీ ఎడ్యుకేషన్ బోర్డు, క్రిస్టియన్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆడిట్ బోర్డు, మొదలగు విభాగముల ద్వారా పరిపాలన నిర్వహింపబడుచున్నది. ఎ.ఇ.యల్.సి. సంఘము ఆంధ్ర ప్రాంతమంతటికి ఆవగింజ వలె వ్యాపించియున్నది. నేడు (2008) ఈ సంఘము యొక్క సభ్యత్వము సుమారు 20,00,000 కలిగి, భారతదేశములోని ప్రొటెస్టాంటు శాఖలన్నిటికంటె మిక్కిలి పెద్దదిగా అలరారు చున్నది. వైద్యశాలలు, ఉన్నత పాఠశాలలు, పారిశ్రామిక పాఠశాలలు, అనాధ శరణాలయములు, ట్రైనింగ్ స్కూలులు, క్రైస్తవ కళాశాలలు మొదలగునవన్నియు మిషనరీల సేవ ఫలితములే! ఈ సంస్థలు దళితుల దైన్యస్థితిని పోగొట్టి వారికొక గుర్తింపు తెచ్చినవి.

మిషనరీలు స్థాపించిన పని – నేడు భారతీయ నాయకుల ఆధిపత్యములో జరుగుచున్నది. క్రీ.శ. 1842 – 2008 మధ్య వ్యక్తిఆదాయము అనూహ్యముగా పెరిగినది. కానీ క్రైస్తవులలోని దాతృత్వం దానికి సమాంతరముగా పెరుగుటలేదు. ఉన్న వనరులను సద్వినియోగము చేసు కొనుచు, ఇతర వనరులను సమకూర్చగలిగిన సంఘ శ్రేయోభి లాషులు, అంకిత భావము కలిగిన నాయకులు కావలయును. క్రైస్తవుడైన ప్రతి వ్యక్తి సంఘాభివృద్ధికి తోడ్పడవలయును. నమ్మకమైన గృహ నిర్వాహకులు ఉన్ననాడు పరిచర్య ఇంకనూ విస్తరించగలదు.

సువార్త సేవ అవసరము ఎప్పుడును ఉన్నదే. కానీ ఆ పనిని చేయువారే అరుదు. “కోత విస్తారము – పనివారు కొద్దిమందే”. ఇది కేవలము పాదిరిగార్ల పని అని తలంచక ప్రతి క్రైస్తవుడు క్రీస్తును పోలి నడుచుకొనుట ద్వారా క్రైస్తవేత్త రులకు సువార్తను అందించగలరు. అట్టివారు లేనిచో సువార్త సేవ కుంటుపడును. హయ్యరు వంటి ధైర్య సాహసంగల క్రైస్తవులు మాత్రమే సువార్తను ప్రకటించి అభివృద్ధి సాధించ గలరు. చెడును విసర్జించి మంచిని పెంచినయెడల క్రీస్తు సువార్త వ్యాపించుటకు అవకాశము కలుగును. ఇట్టి రక్షణ సువార్త సేవలో మనమందరము పాలిభాగస్థులమును, జత పనివారమును కావలయుననునదే ఈ పుస్తకము యొక్క సందేశం. హయ్యరు మహనీయుడు. పరిశుద్ధ గ్రంధమును చేబూని గుంటూరు పట్టణములో ప్రవేశించుటయే దైవ రక్షణ ప్రణాళిక. ఆంధ్ర ప్రాంతమంతటిని సువార్తకేంద్రముగా తీర్చిదిద్దిన ఫాదర్ హయ్యరుకు మనమెంతో ఋణస్థులము.

**“నీతిమార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో – వారు నక్షత్రమువలె నిరంతరము ప్రకాశించెదరు” (దానియేలు 12:3)**

**(సమాప్తం)**

9

# లోకంతీరు

విలాసవంతమైన జీవితం అంటే తన స్థాయికి తగినంత కంటే ఎక్కువగా వుండాలని కోరుకోవడం. ప్రతి ఒక్కరూ ముందుగా తనకు ఒక సొంత ఇల్లు కట్టుకొని స్థిరపడాలని కోరుకుంటాడు. గుడిసెలో జీవించే వాడు శ్లాబు వేసిన ఒక పక్కా ఇల్లు వుంటే బాగుంటుంది అనుకుంటాడు, పక్కా ఇంట్లో వుండే వాడు, ఇంకా ఎక్కువ గదులు వుండే మేడలో వుండాలని కోరుకుంటాడు, రెండంతస్తులు ఉన్నవాడు నాలుగంతస్తులు కోరుకుంటాడు. ఇంకా ఇంటికి సంబంధించిన వస్తువులు, కార్లు, స్థలాలు, పొలాలు, బంగారం, డబ్బు ఎంత ఎక్కువగా సంపాదిస్తే తన స్థాయి అంత పెరుగుతుంది. కాబట్టి వీటి సంపాదనే ధ్యేయంగా తన జీవితం వుంటుంది. డబ్బు ఎంత సంపాదిస్తే తనకు సరిపోతుంది అన్నదానికి మితంలేదు. డబ్బు సంపాదించ డానికి రకరకాల మార్గాలు అన్వేషిస్తుంటాడు. ఉద్యోగం ద్వారానో, వ్యాపారం ద్వారానో వచ్చే డబ్బు తన విలాసాలకి సరిపోకపోతే ఇంకా ఇతర మార్గాల ద్వారా సంపాదించాలని కోరుకుంటాడు.

ఒక మనిషి తనకొరకు రోజుకి వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తే 70 సంవత్సరాలకు 2 కోట్ల 52 లక్షలు ఖర్చు చేస్తాడు. ఒకవేళ ఆ మనిషి 10 కోట్లు సంపాదించినా ఇంకా సంపాదించాలి అనుకుంటాడు. చనిపోయే వరకు కూడా సంపాదిస్తూనే ఉంటాడు. ఈ లోకములోని భోగాలను అనుభవించడానికే మనిషి సంపాదిస్తుంటాడు.

ఇదంతా తన 'ఘనత' కోసమే. మనిషి తన ప్రతి అంశములోను ఘనత చూపించుకోవాలని ఆరాటపడు తుంటాడు. ఈ లోకంలో జీవించే మనుష్యుల ముందు తన గొప్పతనాన్ని ప్రదర్శించుకొని 'ఘనత' పొందాలని కోరుకుంటాడు. అయితే మనిషి దేనినైతే తనకు ఘనముగా ఎంచుకుంటాడో దానిని దేవుడు అసహ్యించుకుంటాడు. **"మనుష్యులు ఘనముగా ఎంచబడినది దేవుని దృష్టికి అసహ్యము"** లూకా 16:15. అంటే మనుష్యులు తమ ఘనతకోసం ప్రాకుటాడే ప్రతిదాన్ని దేవుడు పెంటలాగా అసహ్యించుకుంటాడు.

ఒక మనిషి '**నేను**' అనుకోవడం ప్రారంభించిన తర్వాత తన '**స్థాయి**'ని పెంచుకోవడానికి దేవుడు తనకిచ్చిన తెలివితేటలను ఉపయోగించి మనుష్యుల ముందు '**ఘనత**' కోరుకుంటాడు. తనను సృజించిన దేవుని తెలుసుకోవడానికి దేవుడు మనిషికిచ్చిన తెలివి తేటలను మనిషి దుర్వినియోగం చేస్తూ, తను ఈ లోకంలో జీవించే పరిమితకాల జీవితం మొత్తాన్ని ఈ లోకానుసారంగా మలచుకోవడమనేది సాతాను మనిషి మీద విసరే వలలో చిక్కుకోవడమే. సాతాను సృష్టించిన ఈ లోకభోగాలు కోరుకోవడమే మనిషి దేవునికి దూరమవడానికి ముఖ్యకారణం.

యేసుక్రీస్తు ప్రస్తావించిన లాజరు – ధనవంతుడు ఉపమానములో (లూకా 16:19-31), ధనవంతుడు చేసిన పాపము ఏమిలేదు, అతను నరహత్య చేయలేదు, అబద్ధము గాని, దొంగతనముగాని, వ్యభిచారముగాని చేసినట్లు ప్రస్తావించబడలేదు. అయినా సరే అతను పరలోకరాజ్యము నకు వెళ్ళలేదు. ఆ ధనవంతుడైన వ్యక్తి చేసిన తప్పు ఒక్కటే తన ధనము ద్వారా ప్రతిరోజు సుఖముగా ఉండాలను కోవడం, దేవుడు తన ప్రక్కన ఉంచిన తన పొరుగువాడైన లాజరును ప్రేమించక పోవడమే తనను నరకమునకు పాత్రునిగా చేసినది. తను ప్రేమించిన తన ధనమే అతన్ని నరకములోనికి నెట్టివేసింది. దేవుడు తనకిచ్చిన ఆరోగ్యము, తెలివితేటల ద్వారా సంపాదించిన ధనమును వెచ్చించి, తనను శోధించడానికి దేవుడు తన వాకిటనే వుంచిన లాజరు యొక్క స్థితిని మెరుగుపరచాలన్న ఆలోచన కూడా ఆ ధనవంతుని రాకపోడవమే, తోటి మనిషిని ప్రేమించలేని స్వభావమే అతన్ని నరకాగ్ని జ్వాలలలో చిక్కుకొనేలా చేసింది.

**(సశేషం)**

# మీరు బైబిలంతా చదివేశారా?

**ప్రియ క్రైస్తవులారా!**

మీ జీవితకాలంలో ఒక్కసారన్నా మీరు బైబిల్ మొత్తం చదివారా? లేనిచో, ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడకు ముందే బైబిలు చదవడం పూర్తిచేయండి. పరిశుద్ధ గ్రంథము నేడు మనకు అందుబాటులో మన ఇంట్లోనే ఉంటుంది. అయినా బైబిల్ చదవడానికి మనం ఆసక్తి చూపడంలేదు. సాతాను కుతంత్రాలకు లోనై, వినోద కార్యక్రమాలకు ఇచ్చే ప్రాముఖ్యత, టి.వి.లో సినిమాలు, సీరియల్స్ చూడటానికి చూపించే ఆసక్తి మన జీవితాలను మార్చివేసే జీవగ్రంథానికి ఇవ్వడంలేదు. రాబోవు రోజులలో దేవుని వాక్యము దొరకని కాలము వచ్చుచున్నది. అప్పుడు దేవుని వాక్యమును వెదకినా దొరకదు.

బైబిలు చదవటం పూర్తి చేయడానికి 72గంటలు (మూడురోజులు) పడుతుంది. ప్రతిరోజు మూడు అధ్యాయాలు చదివితే ఒక సంవత్సరం పడుతుంది. దేవునికోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? అనారోగ్యంతో ఉన్నప్పుడో, కష్టకాలంలోనో బైబిలు చదవటం కాదు. ప్రతిరోజు బైబిలు చదవడం అలవాటు చేసుకోవాలి. (ద్వితి. 11:18 - 20). బైబిలు చదవడం బోరుకొడుతుందని, అర్థం కావడంలేదని, మర్చిపోతున్నామని అనేకమైన కరాణాలు చెప్పడం అర్ధ రహితం.

బైబిలు మొత్తం చదవాలని మనస్ఫూపూర్తిగా అనుకుంటే దేవుడు తప్పక సహాయం చేస్తాడు. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2కొరింథి 6:2) బైబిలు మొత్తం చదవడం ఒక సవాలుగా తీసుకొని నేడే చదవటం ప్రారంభించండి. మీరు ప్రతిరోజు బైబిలు చదవడానికి గుర్తు చేయాలంటే <B R R> అని మీ మొబైల్ నెంబరు, పేరు, ఊరు, వయస్సు 9959949984కి మెసేజ్ పంపించండి. ప్రతిరోజు మూడుసార్లు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, మీకు గుర్తుచేస్తాము. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని బైబిలు చదవడం పూర్తిచేసి దేవుని ఆశీర్వాదాలు పొందండి.

**దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల ఎటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. హెబ్రీ 4:12**

సకల జనములకు సువార్త ముందుగా ప్రకటింపబడవలెను. **మార్కు 3:10.** ఈ లోక రాజ్యసువార్త సకల జనులకు సాక్షార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటు తర్వాత అంతము వచ్చును. **మత్తయి 24:14**

**ఎస్.ఎం.యస్. ద్వారా ప్రతిరోజూ మీరు బైబిలు వాక్యమును ఉచితంగా పొందదలచినచో మీ మొబైల్ నెంబర్ మాకు మెసేజ్ చెయ్యండి. మీ మొబైల్ నెంబరు, పేరు, ఊరు, వయస్సు ఈ క్రింది నెంబరుకు మెసేజ్ పంపండి.**

**995 994 9984**

**మీ స్నేహితులు, బంధువులకు కూడా బైబిలు వాక్యము మెసేజ్ ద్వారా పంపాలంటే వారి మొబైల్ నెంబరు, పేరు, ఊరు, వయస్సు మాకు మెసేజ్ పంపండి.**

**ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెలుగు బైబిలు చదవండి!**

**www.blm.org.in**

**మీ స్నేహితులు, బంధువులకు తెలియజేయండి!**



!

మీ జీవితానికో అద్భుతం అవసరమా?

అలాగైతే గుంటూరు, కన్నెవారు 4వ లైన్లోని ఎల్షద్దాయ్‌చర్చిలో

ప్రతినెల రెండవ శనివారం రాత్రి 10గంటల నుండి ఉదయం 5 గంటల వరకు

ప్రజలందరికీ జరిగే సంపూర్ణరాత్రి ప్రార్థనారాధన లో ఆహ్వానం

బంధుమిత్ర సమేతంగా పాల్గొని దైవాశీస్సులు పొందండి.

అంతర్జాతీయ సువార్తికులు, అద్భుతఘడియ T.V.కార్యక్రమ సందేశకులు (9 నిమిషాలు గుండె ఆగి మృతిచెంది యేసుప్రభుని కృపవలన సజీవులైన) **బిషప్ డా॥శాంతవర్ధన్ గారు** దైవ సందేశమిచ్చి ప్రతిఒక్కరికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

గమనిక: గుంటూరు, ఎల్షద్దాయ్‌చర్చిలో ప్రతి ఆదివారం ఆరాధన ఉదయం 11-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు

ప్రతి మూడవ శనివారం సా॥ 6 గం॥ల నుండి రాత్రి 10గం॥ల వరకు విజయవాడ, ప్రభోధబుక్‌సెంటర్,C.S.i ఆడిటోరియంలో వీరిచే మహిమాన్వితసభ జరిగించబడును.

ప్రతి సోమవారం ఉదయం **గం. 6-30 ని.లకు "అద్భుతఘడియ"T.V** కార్యక్రమం **'శుభవార్త' T.V** ఛానల్లో వెలువడును.

అత్యవసరప్రార్థనాఅక్కరలకుఫోన్(0863)2354536,సెల్:09848113886

Email:santhavardhan@yahoo.com.

Web:www.goodnewsmessengers.org.in

ABUNDANT LIFE STUDIES, P.O. BOX-318, GUNTUR-522004 (CELL:9959952838)

Website:www.abundantlifestudies.org.in

**సమృద్ధి జీవం అధ్యయనాలు**

(ఇంగ్లీష్, తెలుగు భాషలలో)

ఉచిత కరస్పాండెన్స్ కోర్సుల నిమిత్తం నేడే మాకు వ్రాయండి.

మా అడ్రస్: అబండెంట్ లైఫ్ స్టడీస్, పోస్ట్‌బాక్స్-318, గుంటూరు-522004 (ఫోన్:9959952838)

**మీ వీడియో, ఆడియో అక్కరలకై సంప్రదించండి**

**జేకి డిజిటల్స్**

1/2 సూర్యటవర్స్(బెంజిసర్కిల్ వద్ద)
నారాచంద్రబాబునాయుడు కాలనీ
విజయవాడ-520010
(ఫోన్:9849819094)

*For your*
VIDEO & AUDIO
NEEDS VISIT
JAKIE DIGITALS,
VIJAYAWADA-520010

# సువార్తలేని కరువు ప్రాంతములు

**10 గ్రామములకు ఒక్క సువార్తీకుడు, సంఘకాపరి కూడా లేని సువార్త కరువు ప్రాంతముల విషయములో ఆత్మల భారము కలిగిన సువార్తీకులు, సంఘకాపరులు, మిషన్ ఆర్గనైజేషన్స్ మమ్ములను సంప్రదించినచో పై ప్రాంతముల వివరములు తెలియజేసేదము.**



క్విజ్ 76

## జూలై నెల ప్రశ్నలు

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే
ఈ శీర్షిక ఉద్దేశ్యం.

**యెషయా 35 - 45వ అధ్యయము వరకు**

**1. హిజ్కియా మాటలను బట్టి మనుష్యులు దేనివలన జీవించుచున్నారు?**

**2. జూలై మాసంలో వనమహోత్సవాలు విరివిగా జరుగును. కానీ నాటిన చెట్లను పెంచునది?**

## ఈ నెల పోషకులు :

**మే 20 నుండి జూన్ 20, 2011 వరకు మాకు చేరినవి.**

| | | |
|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | వరంగల్ | 2000 |
| డా॥ ప్రభావతి సోనార్‌బాబు | దర్శి | 1500 |
| బిషప్. డా॥ఎమ్. ఎస్. శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీ జడ్. సి. దేవదానము | కర్నూలు | 1000 |
| శ్రీ సి. హెచ్. సాల్మన్‌రాజు | నర్సారావుపేట | 1000 |
| శ్రీ బొప్పూరి కిరణ్‌కుమార్ | ఖారగ్‌పూర్ | 1000 |
| శ్రీ బొప్పూరి ఉదయ్‌కుమార్ | భట్టిప్రోలు | 1000 |
| రెవ. పులుకూరి విక్టర్ అబ్రహాం | కందుకూరు | 1000 |
| శ్రీ వెంగయ్య చౌదరి | కొమరోలు | 1000 |
| శ్రీ పి. గ్రేషియస్ | ఏలూరు | 1000 |
| శ్రీ బి. ఇశ్రాయేలు | ఏలూరు | 1000 |
| శ్రీ సామ్యేల్ విల్సన్ | నెల్లూరు | 1000 |
| శ్రీ కాశయ్య | జంగారెడ్డిగూడెం | 600 |
| శ్రీమతి దాసరి నయోమి | తెనాలి | 500 |
| శ్రీ హ్యారీ బెన్నిసన్ | బెంగుళూరు | 500 |
| అపోస్తలుడు ఎబినేజరు | హైదరాబాదు | 500 |
| శ్రీ పాటిబండ్ల సామ్యేలు | కందుకూరు | 500 |
| శ్రీమతి నాగేశ్వరి భాస్కర్ | హైదరాబాద్ | 500 |
| శ్రీ నిమ్మగడ్డ సాల్మన్‌రాజు | విజయవాడ | 500 |
| సహోదరి తబిత | విజయవాడ | 500 |

### జూన్ నెల ప్రశ్నలకు జవాబులు:

**1. "దేవుని నక్షత్రములకు పైగా.... మహోన్నతునితో సమానునిగా చేసుకొందునా" అని ఎవరు, ఎందుకని అనుకొన్నారు?**

**జవాబు :** దేవుని నక్షత్రములకు పైగా, ఆకాశమునకు పైన, మేఘమండలములకు ఉన్నతముగ స్థలముండే అవకాశమున్నదేమో గానీ దేవునికి పైన అంటూ ఏమీ లేదు. అందుచే సమానునిగా అని సరిపెట్టుకుంటున్నాడు. అత్యున్నతమైన..... (6:1) చూడుడి.

**2. సైన్యము, శక్తి, న్యాయము లేక చట్టము వలన కాక మరి దేనివలన సింహాసనము స్థాపించబడును?**

**జవాబు:** కృపవలన 16:5

### జవాబులు ప్రయత్నించినవారు :

**శ్రీమతి జి. అన్నమ్మదానియేలు (నరసరావుపేట)**

| | | |
|---|---|---|
| రెవ. కరుణాకర్ త్యాగరాజు | కావలి | 500 |
| బ్రదర్ కట్టుపల్లి యోహాను | తెనాలి | 500 |
| రెవ. డేవిడ్ నీలకాంత్ | నెల్లూరు | 500 |
| శ్రీమతి సి. హెచ్. హేమలత | హైదరాబాద్ | 500 |
| శ్రీమతి జయమ్మ | కావలి | 400 |
| శ్రీమతి చంద్రకళ బోయజు | ఒంగోలు | 300 |
| హోసన్న చర్చి | కావలి | 300 |
| శ్రీ వినయ్‌కుమార్ | వేటపాళెం | 300 |
| శ్రీమతి అన్నమ్మ దానియేలు | నర్సారావుపేట | 250 |
| కుమారి డి. బ్లెస్సీ | తెనాలి | 200 |
| శ్రీ కోటిలింగారావు | టంగుటూరు | 200 |
| శ్రీ సుగుణభూషణరావు | చీరాల | 200 |
| శ్రీ వెంకటేశ్వర్లు | కావలి | 200 |
| శ్రీమతి దాసరి సుభాషిణి | కావలి | 200 |
| శ్రీ కడియం ప్రసాదబాబు | ఒంగోలు | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీ తెంటు శేఖర్ | విజయవాడ | 200 |
| శ్రీమతి శారా అబ్రాహాము | కాకినాడ | 200 |

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు 21

ఈ సందర్భములో మచిలీపట్టణం నోబుల్ కాలేజిలో తెలుగులెక్చరర్గా పనిచేస్తున్న శ్రీ భట్టు శ్యాంప్రసాద్గారు ఫోను చేసారు. వారు యం.ఫిల్. (పి.హెచ్.డి.) చేయటానికి తెలుసు క్రైస్తవ నవల అనే శీర్షిక మీద పరిశోధన చేయటానికి నాగార్జున యూనివర్సిటి నుండి అనుమతి పొందియుండి వివిధ క్రైస్తవ రచయితలు వ్రాసిన తెలుగు నవలలు కొని, నాగార్జున యూనివర్సిటిలో ప్రొఫెసర్ కృపాచారిగారి ద్వారా 'కొడవటికంటి' రచన 'నా చిత్తానుసారుడు'ను పరిశోధనకు ఎన్నుకున్నారు.

పరిశోధనలో రచయిత జీవితచరిత్ర కూడ ఒక భాగమైనందున శ్యాంప్రసాద్గారు సామ్యేలుకు ఉత్తరం వ్రాశారు. సామ్యేలు జీవితము గురించి తెలుసుకోవడానికి ఒంగోలు ఎప్పుడు రావచ్చునని అడుగగా అందుకు సామ్యేలు 'ఈ పనిమీద మచిలీపట్నం నుండి ఒంగోలు వచ్చేకంటే నేను తరచుగా విజయవాడ వస్తుంటాను. కాబట్టి పదిరోజుల్లో మచిలీపట్నం వస్తాన'ని ఫోన్చేసి పదిరోజుల తర్వాత మచిలీపట్నం వెళ్ళి శ్యాంప్రసాద్ని చూసివచ్చాడు. ఆ సందర్భముగా నోబుల్ కాలేజిలో పనిచేసేస్టాఫ్లో ఎక్కువ మంది హన్నాకృప మాసపత్రిక చందాదారులుగా చేరారు.

సామ్యేలు ఒంగోలు తిరిగివచ్చిన తర్వాత హైదరాబాద్లో సెక్యూరిటీ ఆఫీసర్గా పనిచేస్తున్న ప్రేమధార వ్యవస్థాపకుడు 'కిరీటి' సామ్యేలుకు ఫోనుచేసి బోయినపల్లిలో ఓ సంఘములో మాట్లాడవలసినదని అడిగాను. అందుకు సామ్యేలు సమ్మతించిన ఓ గంటలోనే హైదరాబాద్ బోయినపల్లిలో నుండి శ్రీ యడవల్లి ప్రసాదరావుగారు ఫోన్ చేశారు.

'మీ రచనలు చదివాము, మిమ్ముల్ని చూచుటకు రావాలనుకుంటున్నాము' అని చెప్పారు. 'ఈ నెల 18న బోయినపల్లి చర్చిలో నేను వాక్యము చెప్పడానికి వస్తున్నాను. మిమ్ముల్ని అక్కడ కలుసుకుంటాను' అని చెప్పారు సామ్యేలు.

18న ఉదయం కిరీటితో కలిసి బోయినపల్లిలో ఓ పేటకి వెళితే వారు అప్పటికప్పుడు శామియానాలు కట్టి మందిరము తయారుచేశారు. ఆరాధన మొదలవగానే సామ్యేలు సెల్ఫోను స్విచ్ ఆఫ్చేసి, దేవుని వాక్యము చెప్పడం పూర్తి అయిన తర్వాత సెల్ స్విచ్ ఆన్ చేసిన కొంచెంసేపటికి శ్రీ యడవల్లి ప్రసాదరావు గారి ఫోను మ్రోగింది. 'మీరు ఎక్కడున్నారు?' అని అడిగాడు. 'బోయినపల్లి' అని చెప్పాడు సామ్యేలు. 'ఉదయం 10:30 నుండి బోయనపల్లిలో ఉన్న ఆలయాలు అన్నీ నాకుటుంబముతో కలసి తిరుగుతూనే ఉన్నాను' అని చెప్పారు.

'సరే ఎక్కడికి రమ్మంటారు?' అన్నాడు సామ్యేలు.

'పోలీస్స్టేషన్ వద్దకు రండి' అన్నాడు ప్రసాదరావు గారు. కిరీటి ఓ బండిమీద పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొని వెళ్తుంటే తెల్లమారుతి800లో ప్రసాదరావుగారు వచ్చారు. ప్రసాదరావుగారి ప్రక్క సీటులో రెండు బ్యాగ్లతో సామ్యేలు కూర్చున్నాడు.

ఓ స్కూలు ప్రక్కన ఉన్న ఇంటివద్దకు వెళ్ళారు. ఆ రోజే ప్రసాదరావుగారి ఇంటికి ఇద్దరు బంధువులు కుటుంబాలతో వచ్చి ఉన్నారు. కనుక మూడు కుటుంబాలతో కలిసి ప్రసాదరావుగారి ఇంట్లోనే వాక్య పరిచర్య జరిగింది. ఒకవేళ ఉదయంకాని సామ్యేలు ప్రసాదరావుగారి కుటుంబమునకు తారసపడి ఉంటే వాక్యము ప్రసాదరావుగారి కుటుంబమునకు వినిపించబడి ఉండేది కాదు. ఇది కూడా దేవుని చిత్తమే కదా! ప్రసాదరావుగారికి మాసాబ్ ట్యాంక్ వద్ద మహాలక్ష్మి అపార్టమెంటులో సొంత ఫ్లాట్ ఉన్నది. కాని పిల్లల చదువుకోసం బోయనపల్లిలో కాపురం ఉన్నారు.

అలా పరిచయమైన ప్రసాదరావుగారు కొద్ది రోజులలోనే ఆత్మీయుడైపోయాడు. ఆయన దాతృత్వమునకు మితిలేదు. దేవునిసేవకు ఆయన ఖర్చు చేసే డబ్బు ఏనాటికి సామ్యేలు ఎస్టిమేషన్ వేయలేకపోయాడు.

విజయవాడలో ఓ వివాహమునకు ఆయన కుటుంబ సమేతముగా వెళ్ళవలసియున్నది. కనుక సామ్యేలు

ఒంగోలుకు వారి కుటుంబాన్ని ఆహ్వానించారు. ఆ రాత్రికి సామ్యేలు హైదరాబాదునుండి విజయవాడ వచ్చి ఉదయం నాలుగు గంటలకు గెస్ట్‌హౌస్‌లో ఉన్న ప్రసాదరావుగారి కుటుంబమును కలుసుకొని ఉదయం 5గంటలకు రైల్వే స్టేషన్‌కి వచ్చి 6గంటలకు పినాకినిలో ఒంగోలు చేరాలని నిర్ణయమైనది. ప్రసాదరావుగారు కుటంబ సమేతముగా విజయవాడ వెళ్ళిపోయారు.

సామ్యేలు హైదరాబాద్ దిల్‌షుక్ నగర్ ప్రక్కనున్న చైతన్యపురిలో ఉన్న చిన్ననాటి చిరకాల మిత్రుడు బొప్పూరి పరంజ్యోతి వద్ద బసచేసి రాత్రి 8గంటలకు ఇద్దరుకలిసి సరూర్‌నగర్ రైతుబజారు దగ్గర విజయవాడ బస్ సామ్యేలును ఎక్కించి పరంజ్యోతిగారు వెళ్ళిపోయారు. బస్ ఎంత చిన్నగా వెళ్ళినా తెల్లవారి మూడుగంటలకు విజయవాడ వెళ్తుందని చెప్పారు. కాని నేషనల్ హైవే మీద విజయవాడ వెళ్ళే బస్‌లు లారీల రద్దీలతో ట్రాఫిక్ జామ్ ఎనిమిదిసార్లు జరిగింది.

ఉదయం 5గంటలకు నందిగామ చేరింది. ఈ హైటెక్‌బస్ ఆరుగంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరు తుందని నమ్మకంలేదు. ఎంత అన్యాయం! యేసుప్రభువును నమ్ముకొనినవారికి నిజముగా యేసుప్రభువునందు విశ్వాస ముంచిన వారికి 'టెన్షన్' ఉండదని సామ్యేలు భావన.

కంచెకచెర్లకి 5:30కు బస్ చేరింది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్రసాదరావుగారిని కలుసుకుంటాను అనే నమ్మిక సామ్యేలుకు లేదు. కనుక ఒంగోలులోని తన ఇంటికి ఫోనుచేసి 8:10కు ఒంగోలు వచ్చే పినాకినిలో ఎ.సి. కంపార్టుమెంటులో ప్రసాదరావుగారి కుటుంబాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళమని తన చిన్నకుమారుడు నతనయేలుకు, చిన్నకుమార్తె జయశీలినికి ఫోనుచేసాడు.

విజయవాడ ఆర్.టి.సి. బస్‌స్టాండు లోనికి బస్ ప్రవేశించకముందే సామ్యేలు బస్‌లోనుండి సరిగ్గా 6:05 నిమిషాలకు క్రిందికి దిగాడు. అక్కడ ఉన్న ఆటోవాళ్ళతో 'పినాకినికి నన్ను రైల్వేస్టేషన్ దక్షిణదిశలో రైలుపట్టాల ప్రక్కన ఉన్న టికెట్ కౌంటర్‌కి తీసుకెళ్తావా?' అని అడిగితే 'పినాకిని వెళ్ళిపోయింది' అన్నారు. అదే మాట మరియొక ఆటో వానితో చెబితే 'పినాకిని వెళ్ళిపోయి ఉంటుంది' అన్నాడు.

ఇంతలో ప్రసాదరావుగారు ఫోనుచేసి 'రైల్వే అనౌన్సరు – కొన్ని కారణాల వలన పినాకిని పదినిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందని చెప్పాడు. ప్రభువు మీకొరకే అనౌన్సు చేయించారు' అన్నాడు. సామ్యేలు ఓ ఆటోలో ఎక్కి 'దక్షిణతట్టు టికెట్‌కౌంటర్‌కి పోనీయ్' అన్నాడు. ఆటో కదిలింది. టికెట్ తీసుకోకుండా 20గజాల దూరంలో ఉన్న ఇంజన్ వద్దకు వెళ్ళి డ్రైవర్‌గారితో 'సార్! టికెట్ తీసుకోలేదు. ఒంగోలు వెళ్ళాలి' అన్నాడు. 'ప్రక్కన ఎక్కండి' అన్నాడు నవ్వుతూ. సామ్యేలు తన రెండు సంచులతో ట్రైనులో ప్రవేశించిన తర్వాతనే ఇంజన్ స్పీడు అందుకున్నది. వెంటనే ఫోనుచేసి ఎ.సి.లో ఉన్న ప్రసాదరావుగారితో సామ్యేలు మాట్లాడాడు. ఒంగోలులో ట్రైన్‌వద్దకు తన కుమార్తె, కుమారుడు వచ్చి ఉంటారు కనుక సామ్యేలు పినాకిని ఇంజన్ వద్దకు వెళ్ళి క్రిందకుదిగి, నిలుచుని ఉన్న ఆరడుగుల వైట్ యూనిఫారం డ్రైవర్‌గారితో "సార్! మీ పేరు?" అన్నాడు. "గజేంద్రన్" అన్నాడు ఆయన. వెంటనే సామ్యేలు సూట్‌కేస్ తీసి అప్పుడే ప్రింటు అయి వచ్చిన అపోస్థలుడు పుస్తకం మీద గజేంద్రన్ పేరు వ్రాసి రచయిత బహుమానంగా ఆయన చేతికిచ్చారు.

ఆద్భుతమైన రీతిలో ప్రయాణం తుదముట్టించిన ప్రభువు కృపవలన క్రొత్తగా చుట్టము స్నేహితుడయిన గవర్న మెంటు పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గారయిన శ్రీ యడవల్లి ప్రసాదరావుగారి కుటుంబముతో స్టేషన్‌కి చాలా దగ్గరలో క్లాపేట ఆరవలైను, కృపాదానం వీధిలోనికి సామ్యేలు సంతోషంగా ప్రవేశించాడు.

అన్నదమ్ములు అక్కచెల్లెండ్రు మేనమామలు పెద్దమ్మ చిన్నమ్మ చిన్నాయన పెదనాయన కుటుంబములతో కాని మరెవరయినా చుట్టాలు ఎన్నడు సామ్యేలు ఇంటిలో చుట్టాల ప్రేమతో ఉండివుండలేదు. సామ్యేలు కూడా ఏ బంధువు ఇంటిలోను కుటుంబసమేతముగా మూడురోజులు కలిసివుండలేదు. ఈనాటికి ఇంతకాలానికి ప్రభువుకృప వలన యేసుప్రభువుప్రేమ వారిహృదయములో ప్రవహించగా శ్రీ యడవల్లి ప్రసాదరావుగారు కుటుంబసమేతముగా సామ్యేలు ఇంట్లో ప్రవేశించారు.

మరునాడు అంతా సముద్రపు ఒడ్డున కొత్తపట్నం లోను ఆకుతోటలోను గడిపారు. ప్రసాదరావుగారు ట్రైన్ రిజర్వేషన్‌తో ఆ మరునాడు హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఒక్కరోజు గడువుంటే చాలు వారికి రిజర్వేషన్ ఎక్కడికయినా దొరుకుతుంది.

**గ్రేటర్** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసరుగా పనిచేస్తున్న శ్రీ యడవల్లి ప్రసాద్‌రావుగారు ఆగష్టు 17న 'హన్నాకృప' ఎనిమిదవ వార్షికోత్సవ పాఠకులసదస్సుకు – ఒంగోలులో హాజరై నప్పుడు వారి తల్లిదండ్రులను గురించి అడిగాడు. ఎందు కంటే సామ్యేలు హన్నాకృపకై సాక్ష్యము సేకరించేటప్పుడు ఆ ప్రముఖుల జీవితాలలో వారి పితరులు – ముఖ్యంగా వారి తల్లిదండ్రుల ప్రభావము ఉంటుంది.

ప్రసాద్‌రావుగారి తండ్రి యేసుదాసుగారు, తల్లి నాగరత్నం. ఆయన విజయవాడకు మూడు మైళ్ళదూరములో ఉన్న గొల్లపూడి గ్రామవాసి. సుమారుగా పొలంవున్నా, ధనవంతుడు కాదు. వారిది ఉమ్మడికుటుంబము. అంతకంటే ముఖ్యముగా అన్ని కులాలవారు, అధికభాగం ధనవంతులు ఉన్న ఆ గ్రామమంతా – ఒకే కుటుంబముగా, తన కుటుంబ ముగా భావించి, ఆ గ్రామమును బహుగా ప్రేమించిన యదార్ధపరుడు.

అందువలన ముప్పై సంవత్సరాల వయస్సులోనే ఆ గ్రామంలోను, చుట్టుప్రక్కల చేరువైన గ్రామాలలోను – అందరి తలలో నాలుకయై, అనేక సాంఘీకబాధ్యతలు స్వీకరించారు. ప్రతి సంవత్సరము జనవరి మొదటి తారీఖున ఆయన స్థానిక సంఘములో దేవుని వాక్యపరిచర్య చేసేవారు. ఆయన 1969వ సంవత్సరం జనవరి మొదటి తారీఖున రెండు గ్రూపుల మధ్య విభేదాలను పరిష్కరించుటకు సైకిలు మీద ఉదయాన్నే వెళ్ళి తిరిగివస్తుండగా ప్రమాదానికి గురై మరణించారు.

ఆయన మరణించిన 26 రోజులకే, గొల్లపూడి గ్రామవాస్తవ్యులేకాక, మరికొన్ని గ్రామాలవారు కలసి ఆయన శిలావిగ్రహమును గొల్లపూడి గ్రామపంచాయితీ స్థలములో ప్రతిష్టించారని తెలుసుకొన్నప్పుడు – ఒక దళితవర్ణముకు చెందిన 40సంవత్సరాల వయస్కుని యొక్క శిలావిగ్రహాన్ని వర్గ వర్ణ జాతి బేధము లేకుండా, అందరు ప్రతిష్టించారని వినిన నాటినుండి అక్కడికి వెళ్ళి ఆ శిలాప్రతిమను చూడాలనిన తలంపుతో తేది: 3-9-2007న సాయంకాలం గొల్లపూడి చేరాడు. నేషనల్ హైవే దిగి గ్రామంలో ప్రధాన రహదారిలో ప్రవేశించగానే యేసుదాసుగారి శిలావిగ్రహం కనబడింది.

ఒక వ్యక్తి యొక్క ఘనతకు – ధనము, కులము, చదువు ఏది పనికిరాదని, అతని వ్యక్తిత్వమే మూలమని, అటువంటి మహావ్యక్తిత్వముగల వ్యక్తి ప్రతిమనైనా చూడ గలగటం చాలా సంతోషాన్ని కలిగించింది సామ్యేలుకు. కీర్తిశేషులైన యడవల్లి యేసుదాసుగారి గుణగణములు ఆయన కుమారునిలో ప్రతిబింబించుట సామ్యేలు ధన్యతగా భావించాడు.

ఓరోజు తెల్లవారి ఐదుగంటలకు ఫోను మ్రోగింది. 'కవిగారూ!' అంటూ పిలుపు. ఈ పిలుపుకోసం గత ఆరు నెలలుగా ఎదురుచూశాడు సామ్యేలు.

కర్నూలులో మిషన్‌వారి ఓ పాత బంగళాలో నివసిస్తున్న జడ్డాం సి. దేవదానం గారి పిలుపు అది. ఆయన ఒక్కడే అలా పిలుస్తారు. కర్నూలు అంటే చక్కని ఆత్మీయత. చిన్ననాటి బిల్లంగోడు (ఇప్పటి క్రికెట్ కంటే మధురమైన ఆట) బెంచ్‌మేట్ కొదమల ఆర్థర్ ప్రసన్నకుమార్ నివశిస్తు న్నాడు. అడ్రసులు దొరికినంత వరకు సామ్యేలు "హన్నాకృప" చిన్ననాటి స్నేహితులందరికి పంపిస్తున్నందువలన 50, 60 సంవత్సరాల క్రితం విడిపోయిన స్నేహితులు అందరు దాదాపుగా కలుసుకున్నారు.

అప్పటికింకా కర్నూలు వరదతో ముంచబడలేదు. ప్రకాశ్‌నగర్ ఫస్టులైనులో ఇల్లు ఉంది. ఆటో ఎక్కి అశోక్‌నగర్ ఫస్ట్‌లైన్‌లో ఆపమన్నాడు. ఆటోఅతను 'ఇదే ఫస్ట్‌లైను, దిగండి' అన్నాడు. దిగి డబ్బులిస్తే వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఇల్లు కనుక్కోవడానికి ముందుకువెళ్ళాలా? వెనక్కువెళ్ళాలా? ఈ బరువైన రెండు బ్యాగ్‌లు చూస్తూ ఆ దారినే వెళ్తున్న ఓ అబ్బాయిని పిలిచి "ఆర్థర్ ప్రసన్నకుమార్ ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు. ఆ అబ్బాయి అటు ఇటు తల తిప్పకుండా

"నీవెనుక" అంటూ వెళ్ళిపోయాడు. ఇంత పిల్లవానికి ఇంత పొగురా? అనుకుంటూ అలానే నిలుచు న్నాడు సామ్యేలు. కొంచెంసేపటికి ఓ అమ్మాయి స్కూటర్‌మీద వెళ్తూ అక్కడ ఆగింది. ఆ అమ్మాయిని "ప్రసన్న కుమార్ గారి ఇల్లు తెలుసా?" అన్నాడు. ఆ అమ్మాయి నవ్వి "మీ వెనుక" అన్నది. ఈసారి సామ్యేలుకు కోపం వచ్చింది. "నీకు తెలుసా?" అన్నాడు. "అదేంటి అంకుల్!" మీ వెనుక బోర్డుచూడండి" అన్నది. సామ్యేలు తలత్రిప్పి చూశాడు.

ఆటో అతను కరెక్టుగా ఆర్డర్ ఇంటిముందు దించాడు. సామ్యేలు తన అజ్ఞానాన్ని కనుక్కోలేక పోయినందుకు సిగ్గుపడ్డాడు.

ఆ లైనులోనే ముగ్గురు ఆత్మీయులు ఎడ్విన్ పాల్ – మైకేల్ ఉన్నారు. ఆ సాయంకాలం సామ్యేలు క్లాస్‌మేట్ మనోరమ ఇంటికి వెళ్ళాడు. తలుపుతట్టాడు. ఓ పెద్దామె వచ్చింది. "ఎవరు?" అన్నది. చేతిలో హన్నాకృప చూపించి "దీని తాలూకు" అన్నాడు సామ్యేలు. "ఔను, ఒంగోలు సామ్యేలు నాకు తెలుసు. మీరెవరు?" అన్నది.

"మీరు దయచేసి మనోరమ గారిని అంటే మిసెస్ ఇశ్రాయేల్ రాజ్‌గారిని పిలుస్తారా?" అన్నాడు.

"నేనే!" అన్నది. అప్పటికి 40 సంవత్సరాల క్రితం పరిచయమున్నవారు.

వారింటివద్ద టిఫిన్ చేసి లూర్దు మేరి గారికి ఫోన్ చేశాడు సామ్యేలు. ఓ అమ్మాయి ఫోను తీసింది. "అమ్మా! నేను హన్నాకృప క్రైస్తవ మాసపత్రిక ఎడిటర్‌ని. ఒంగోలు నుండి వచ్చాను. మీ ఇంటికి దారి చెబుతారా?" అన్నాడు.

"అంకుల్! మీరెక్కడ ఉన్నారో చెప్పండి. నేను అక్కడికి వచ్చి మిమ్మల్ని మా ఇంటికి తీసుకొనివెళ్తాను" అన్నది. ఫోను మనోరమకు ఇస్తే అడ్రసు చెప్పింది. అరగంటలో అనిత లూర్దుమేరి గారి కుమార్తె స్కూటర్ మీద వచ్చి "రండి అంకుల్! ఇంటికి వెళ్దాము" అన్నది. అప్పటి నుండి సామ్యేలుకు కర్నూలులో ఎక్కడికి వెళ్ళాలన్నా ఓ సొంత స్కూటర్ ఉండినది.

ఇప్పుడు ఫోనులో ఉదయాన్నే జడ్.సి.దేవదానం గారు పిలిస్తే ఇది శుభసూచకమే అవుతుంది. సామ్యేలు రచన 'విశ్వాసంలో ఓ మెట్టు' పుస్తకము పాఠకుల చేతిలోనికి రావడానికి కారణమైనవారు జడ్.సి.

"ఏమిసార్" అన్నాడు సామ్యేలు.

"నేను ఆరునెలలు అమెరికాలో నాకుమారుని వద్ద ఉండి నిన్ననే కర్నూలు వచ్చాను. మీరు కర్నూలుకు సాయంకాలం బస్‌లో బయలుదేరి పొద్దున ఇక్కడ దిగండి" అన్నారు.

**(సశేషం)**

---

**3 వ పేజి తరువాయి భాగం**

కుమారుని వివాహము జరిగినది. నేను ఆ పెండ్లికి హాజరయ్యాను. కాని చివరలో భోజనసమయంలో అక్కడ నుండి రావలసివచ్చింది. తర్వాత కొంతకాలానికి నేను వారిని కలుసుకొనినప్పుడు "వివాహము అయిన తర్వాత వెళ్ళిపోయారే?" అన్నారు. "ఇన్ని వేలమంది ఆహ్వానితులలో నన్ను ఒక్కడిని ఎలా గుర్తు పెట్టుకున్నారు?" అని వారి ఆత్మీయులలో ఒకరినడిగాను.

"వివాహము అయిన తర్వాత వివాహమునకు హాజరయిన దేవసేవకులందరికి పేరుపేరున కానుక ఇచ్చారు. మీరు లేరు" అన్నారు.

అయితే నేను వారితో మాట్లాడి తిరిగి వస్తుంటే వివాహములో ఇవ్వవలసిన కానుకను ఆమె నాకిచ్చారు. అది బాకీ డబ్బులు కాదు కాని దేవునియెడల వారికున్న ప్రేమను మాటలలో కాక చేతలలో చూపించారు. వారి చేతులలోనుండి డబ్బులు తీసుకొంటున్నవారికంటే ఆ కానుక ఇస్తున్న డా॥ప్రభావతిగారి కండ్లలో దేవుడు తనకు ఇతరులకు ఇచ్చే శక్తిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు కనిపించాయి.

నిజంగా మన జీవితములో మన జీవనమంతయు దేవుని సేవకొరకు ఇచ్చే మనసును దేవుడు మనకిచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెల్లించాలి.

**(సశేషం)**

# కీ॥శే॥ వై.యస్. చిన్నకొండా రెడ్డి గారు

10

**ఆదర్శ దంపతులు** (శ్రీమతి సుశీల ఆనందరెడ్డి, పెద్దకోడలు, పులివెందుల గారి మాటలలో) :-

మా మామగారు శ్రీ వై.యస్. చిన్నకొండారెడ్డి గారు చాలా గొప్పవ్యక్తి అని చెప్పవచ్చును. క్రమశిక్షణతో ఉండేవారు, తన బిడ్డలను కూడ అదేవిధముగా పెంచినారు. డబ్బులున్నా, భోగభాగ్యాలతో జీవించాలని అనుకునేవారు కాదు. చాల సాధారణమైన జీవితము జీవించేవారు. ఒకసారి క్రిస్మస్ పండుగనాడు అందరికీ బట్టలు తీసినారు. అప్పుడు పట్టుచీరవైపు చూస్తుంటే, 'అది నాలుగు వేలు ఖరీదు. ఇంత విలువైన బట్టలు కొనే అవసరము లేదు. ఈ డబ్బుతో ఇంకా నలుగురికి తీసుకోవచ్చు' అని చెప్పినాడు. ఎప్పుడూ విశాల హృదయంతో అందరికి సహాయము చేయవలెనని అనుకొనే వారు. మా అత్తగారి కుటుంబములో 11 మంది సభ్యులు, వాళ్ళ అవసరాలన్నీ తీర్చే దానికి ఎంతో కష్టపడాలి. కానీ మా కొండారెడ్డి మామగారు కేవలము తమ బిడ్డలను గురించి కాక, తన చెల్లెల్లను గురించి వారి బిడ్డలను గురించి, తన తమ్ముళ్ళను గురించి వారి బిడ్డలను గురించి కూడా చాలా ఆలోచించేవారు.

విమలమ్మ భర్త కుమారకోటిరెడ్డి చనిపోయినప్పుడు మా మామగారు చాలా బాధపడి ఏడ్చినారు. రాజారెడ్డి మామ మా మామగారిని ఓదార్చినారు. ఇంత చిన్న వయస్సులో భర్తను పోగొట్టుకొని జీవితము ఎలా గడుపుతుందని బాధపడినారు.

మా మామగారు కష్టజీవి. క్రమశిక్షణ గల మనిషి తన బిడ్డలను ఆ దారిలోనే నడుచుకొనుమని సూచించే వారు. మా మామగారికి దైవభక్తి ఎక్కువ. హైదరాబాద్‌లోని విజయనగర్ కాలనీలోని సంఘానికి ఎక్కువగా వెళ్ళేవారు. వారికి తనవంతు డబ్బు సహాయము కూడా చేసేవారు. ప్రతిరోజు ఇంటివద్ద కుటుంబ సభ్యులతో కలసి ప్రార్థన కూటములు జరుపుకునేవారు. నేను ఒకరోజు మామగారితో "మీరు ఇంత భక్తితో ఉంటారు కాబట్టి దేవుడు మీకు మంచి అల్లుళ్ళను ఇచ్చినార"ని అన్నాను. అయితే మామగారు – "దేవుడు మంచి అల్లుళ్ళే కాదమ్మా మంచి కోడళ్ళను కూడా ఇచ్చినారు" అని అన్నారు.

ఒకరోజు మా మామగారు చేయించే పని వద్ద నుండి ఒక ఇంజనీరు ఇంటి దగ్గరికి వచ్చియుండెను. అతను మాటలలో మీ మామగారు పని వద్ద ఉంటే లాభాలు ఎక్కువగా రావని చెప్పమని చెప్పినాడు. సిమెంట్ సరి అయిన కొలతలలో వేయాల్సిందే అందులో ఏ మాత్రము తక్కువ చేసిన ఒప్పుకొనేవారు కాదు. అయితే నేను మామగారు వచ్చినప్పుడు ఆ సంగతి చెబితే "మన లాభాలు చూసుకొని పనికి నష్టము చేయకూడదు కదా! ఎంతవస్తే అంతే చాలు, నిజాయితీగా పనిచేస్తే ఆ దేవుడే కాపాడుతాడ"ని అని చెప్పినారు.

మా అత్త మామగారు ఆదర్శదంపతులని చెప్ప వచ్చు. మా అత్తగారు రాజమ్మగారు కూడా చాలా కష్టజీవి. పేదలకు ముఖ్యముగా రోగాలతో ఉండేవారికి చాలా సహాయము చేసేవారు. ఇప్పుడు 94 సంవత్సరాలు అందువలన ఎక్కువగా చేయలేరు. కానీ అందరి గురించి ఎక్కువగా అనుకుంటుంటారు.

మామగారి విగ్రహము ఒకటి ప్రకాష్‌రెడ్డి గారి మైన్స్‌లో పెట్టిన బాగుండేదని అనుకొనుచున్నాను. పనివాళ్ళు ఒక క్రమశిక్షణ పనిచేయుటకు అలవాటుపడతారని అనుకుం టాను. నీతికి నిజాయితీకి క్రమశిక్షణకీ మారుపేరు మా మామగారనే చెప్పవచ్చును. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకొనుచున్నాను.

**సందేశం** (వై.యస్. ప్రతాప్‌రెడ్డి, తృతీయ కుమారుడు, పులివెందుల గారి మాటలలో) :-

నా చిన్నతనము నుండి మా తల్లి, తండ్రి నాకు నేర్పినవి దైవభక్తి, కార్యదీక్ష, నీతి, నిజాయితీ. నా అను భవంలో నా తండ్రిగారు రైల్వేవర్కు రేణిగుంట్ల మరియు బాలపల్లె మధ్యలో పనిచేసిన సమయంలో పడిన కష్టములు, నష్టములు, డబ్బు లేమి – ఈ పరిస్థితుల్లో కూడా అన్ని

పూర్తి చేసి, ఆస్తి అమ్మి, అప్పులు చెల్లించి మా తండ్రిగారి నీతి నిజాయితీ నిలబెట్టుకున్నారు. మా తండ్రిగారి దైవభక్తి, కార్యదీక్ష, నీతి, నిజాయితీ వలననే నా అన్నదమ్ములు, అక్కచెల్లెల్లు ఈరోజు ఈపరిస్థితిలో ఉన్నందుకు సంతోషంగా ఉన్నాము. మేము ఈ స్థాయిలో ఉన్నాము అంటే మా తల్లి మరియు మా తండ్రి కారణము.

"యెహోవా, నీ గుడారములో అతిధిగా ఉండదగిన వాడెవడు?

నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగిన వాడెవడు?

యదార్ధమైన ప్రవర్తన గలిగి నీతి ననుసరించుచు హృదయపూర్వకముగా నిజము పలుకువాడే.

అట్టివాడు నాలుకతో కొండెములాడడు, తన చెలికానికి కీడు చేయడు

అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు."

**కీర్తన 15:1-4**

**సంపూర్ణ వ్యక్తిత్వమున్న మనిషి** (డాక్టర్ ఇ.సి. గంగిరెడ్డి, మూడవ అల్లుడు, పులివెందుల గారి మాటలలో) :-

1972వ సంవత్సరములో నా వివాహము శ్రీ వై.యస్.చిన్నకొండారెడ్డి గారి మూడవ కుమార్తె డాక్టరు సుగుణమ్మతో జరిగినప్పటి నుండి నాకు శ్రీ చిన్నకొండారెడ్డి గారితో చాలా సన్నిహిత సంబంధం ఏర్పడినది.

1977లో నేను డాక్టర్ చదువు పూర్తి అయినప్పటి నుండి నేను పులివెందులలో ప్రాక్టీసు చేయుచున్నాను. నా ప్రాక్టీసులో ఆయన చాలా సహకరించారు.

శ్రీ వై.యస్.చిన్నకొండారెడ్డి గారు ఒక సంపూర్ణ మైన మంచివ్యక్తి. ఆయనకు దేవునిపై అచంచల విశ్వాస ముండేది. మంచి జరిగినా, చెడు జరిగినా ఏది జరిగినా అది దైవసంకల్పమే అని మనసారా నమ్మిన వ్యక్తి. ఆయన మంచి మానవతావాది. సాటిమనిషిని ప్రేమగాను, గౌరవం గాను, అభిమానంగాను చూసేవారు. కష్టమంటే బాగుగా నమ్మిన వ్యక్తి. తన జీవిత కాలమంతయు కష్టపడి, ఆర్జించి బ్రతికిన వ్యక్తి. ఆయన బ్రతికినంతకాలము ప్రతి ఒక్కరికి మాదిరిగా బ్రతికేవారు. ఆయన వృత్తిరీత్యా చాలా నిజాయితీ గల కాంట్రాక్టర్‌గా జీవించేవారు.

వ్యక్తిగతంగా నాకు చాలా అప్తుడు. నా పెండ్లి జరిగినప్పటి నుండి నన్ను చాలా ప్రేమగా చూసుకునేవారు. మా హాస్పిటల్ దినేష్ నర్సింగ్ హోం స్థాపించటము, దీనిని సమర్ధవంతముగా నడిపించుటకు, మా పిల్లలైన భారతిని, దినేష్‌ను చాలా బాగుగా చూసుకొని మంచి మార్గములో నడిపించేటందుకు ఆయన పెంపకమే ముఖ్యమని మేము భావిస్తాము. ఆయన చూపిన ప్రేమానురాగములు మేము ఎన్నటికి మరువలేము.

**మా నాన్నగారితో తీపి జ్ఞాపకాలు** (డాక్టర్ సుగుణమ్మ, మూడవకుమార్తె, పులివెందుల) :-

మా నాన్నగారితో మాకున్న కుటుంబ, సన్నిహిత సానిధ్య, అనుభవాలలో కొన్నింటిని మీతో పంచుకోవడానికి కృపనిచ్చిన దేవునికి వందనములు తెలియజేస్తున్నాను.

మాది పెద్దకుటుంబం - మొత్తం సంతానం 11 మంది. 6గురు మగపిల్లలు, 5గురు ఆడపిల్లలం. నేను ఆరవ సంతానం. నాన్న, రాజారెడ్డి చిన్నాయన, సి.వి. సుబ్బారెడ్డి మామగారు కలిసి కాంట్రాక్టు పనులు చేస్తుండే వారు. కొంతకాలం ముగ్గురు కలిసి పనిచేసిన తరువాత ఎవరికివారుగా సొంతంగా కాంట్రాక్టు పనులు ప్రారంభించి నారు.

వేకువజామునే నాన్నగారు లేచి బైబిలు చదివి, ప్రార్ధన చేసుకున్న తరువాతనే మిగతా పనులు చేసుకునే వారు. ప్రతిరోజు కుటుంబ ప్రార్ధన తప్పనిసరిగా ఉండేది. నాన్నంటే ఎంతో గౌరవం, భక్తి. మేమెవ్వరం కూడా ఆయనకు ఎదురు సమాధానం చెప్పేవారము కాము.

నాన్నగారికి ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. అమ్మ మాత్రం ఎంతో జాగ్రత్తగా నాన్నను చూసుకునేది. ఏది కావాలన్నా అప్పటికప్పుడు సిద్ధపరిచేది. అమ్మకు చదువు రాదు. రాకపోయినా కుటుంబ ప్రార్ధనాసమయానికి పనులన్నీ ముగించుకుని ఎక్కువగా ప్రార్ధనకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇంటి పనితో దినమంతా అలసిపోయినా మాకు పనులు చెప్పేది కాదు.

**(సశేషం)**

# శారా అబ్రాహాము

శ్రీమతి శారా అబ్రాహాము, కాకినాడ

దేవుని నామానికి స్తోత్రములు! దేవునిలోకి వచ్చాక ఎంతగా మారినామో మీరింకా తెల్సుకుంటే చాలా ఆశ్చర్య పోతారు. ఎవరైనా విగ్రహారాధికులకి అన్యులకే ఈ పత్రిక చదవమనండి. మా నాన్నగారు ఉగాది పండుగకి రెండు రోజులు ముందుగా పంచాంగంలు రెడీ చేయించేవారు. బల్లి పడే శాస్త్రం నుండీ వర్జాలు, మంచి చెడుల ముహూర్తాలు, నక్షత్రాలు, శకునాలు, రోజువారిగ ఒక డైరీ (తెలుగు సంవత్సర వివరాలు)లా ఉండేది. చాలామందికి చదువుకున్న వారందరికీ ఒక స్వీటుప్యాక్‌తో పాటు పంచి పెట్టేవారు.

గ్రహణాలు విషయంకి వస్తే – దర్భలు (ఏదీకాని) ఆకుముక్క అన్ని పదార్థాల్లోను వేసేదానిని. గర్భిణిగా ఉన్నప్పుడు కదలకుండా బొమ్మలాగా ఉండి ఎవరితోనో ఏ ముక్కు చెవి మీద గోకమనేవారం. అలాగున లేకుంటే "గ్రహణం మొర్రు"తో పుట్టేస్తారని అపోహతో (పెద్దల ననుసరించి) ఉండేదానను. కానీ దేవునిలోకి వచ్చాకే కదా! ఈ అపోహలన్నీ తొలగిపోయింది. నా కోడలు బాప్తీస్మం అప్పటికి తీసుకోలేదు. గ్రహణం గడిపింది. మా ఫ్యామిలీలో ఎవరూ లేనంత అందంగా, తెల్లగా, మహాచురుకు, మహా తెలివైన బ్రెయిన్. యేసు ప్రభువుకృపతో జగత్ పుట్టాడు. ఇపుడు యు.కె.జి.కి వచ్చాడు. దయచేసి మీరు వాడిగురించి ప్రార్థన చేయండి.

మా అమ్మ గారైతే నా తలదువ్వి జడలు వేయడానికి ఏం గొణుక్కునే వారో? కారణం? నా పాపిడి తిన్నగా చక్కగా వెంటనే రాలేదని. నా బ్రతుకు నా పాపిడి చెప్పేస్తుంది. నా భవిష్యత్తు, నా జీవినవిధానం బాగోదని ఇంకా నా ఎడమ అరచేతిలో రెండు రేఖలు కాస్తంత యెడం ఉండుట వలన అవి భార్యాభర్తల రేఖలనీ ఇద్దరం కల్సి ఉండమని తగాదాలతో వారు విడిచి పెట్టేస్తారని, తల్లిగా ఆ టైంలో భయపడి చాలా చాలా సంబంధాలు చూశారు అమ్మ, నాన్న.

రిటైర్ అయి, ఆరు సంవత్సరాల బాబుకి తాత నాయనమ్మలుగా, పది పాసైన ఉదయ్‌కి, ఎనిమిదిలోకి వచ్చిన కీర్తికి అమ్మమ్మ తాతయ్యలమై జీసస్ మీటింగ్స్‌కి (కొంతవరకూ) కల్సివెళ్ళుట – దేవునిఆశీస్సులతో అన్యోన్యంగా ఉంటున్నాము.

మరోఅద్భుతం – 2011 మేనెల 21న డాబా పైకెక్కిన వారు దిగుతూ పనిపిల్ల పూర్తి క్లీనింగ్ లేక, జారి పడిపోయినారు. అసలే ఇరవై సంవత్సరాలుగా బాల్డ్‌హెడ్, నున్నగా సమ్మర్ కటింగ్ ముందురోజు. ముగ్గురం కల్సి లేవనెత్తాము. దేవుని నామానికి స్తోత్రములు! ఏ రక్తదెబ్బా, బొడుపుగాని, చర్మం చిట్లటంగాని జరగలేదు. డయాబెటీస్‌తో బాగా సీనియర్ మా వారు. పడ్తే కోమాలోకైనా లేదా ఆన్ది స్పాట్ డెడ్ అయినా జరుగుతాయట. మావారికి యేసయ్య చాల కాపుదల ఇచ్చారు. హల్లేలూయా!

నేను మా అత్తగారింట్లో చాలా పిచ్చిపనులు చేశాను. (అందరం) ఏ దూరపు ఇంటిపేరు కల్సిన చుట్టమో చచ్చారని మేము చచ్చేవారము. క్రింద పడుకోవడం, బీరువాలు ముట్టుకోకుండా అబ్బో! రాయడానికి స్థలం సరిపోదు. అన్నీచేసి చివరిరోజు గోమాతా అంటూ ఆ ఆవు మూత్రం మా అత్తగారు తెచ్చి, ఆస్తులు పంచినట్లు అందర్కీ గ్లాసులలో వేసి తమలపాకుతో ముంచి (పసుపుని కూడా కలిపేది) ఆ నీటితో ఇంట్లో అన్ని పాత్రలు వస్తువులు దుస్తులు బీరువాలు అన్నింటిలో చల్లేసేవారము. ఇక ఆ మైలు పోయింది అంతే! పండుగ దినాలలో ఆవు ముఖానికి పసుపు కుంకుమ పెట్టి దణ్ణాలు – ఎదుట ఒకటి వెనుక తోకదగ్గర ఒకటి పెట్టేదానను.

ఇంకా పాతరోజులైతే 13 సంవత్సరాల వయస్సు వరకు సంక్రాంతి నెలలో పండుగలు అని గొబ్బెమ్మ పూజలు గొబ్బిళ్ళు పెట్టేదానిని (అమ్మగారు చేయించేవారు) ఎలాగో తెలుసా? పేడముద్ద పూజపీటపై ఐదు పెట్టించి పసుపు, పువ్వులు, కుంకుమ, గంధము, ఆఖరికి హారతి ఇచ్చేదానను. 30, 40 మంది నాఈడు స్నేహితులు వచ్చేవారు. ఎంత ఆచారమో చూశారు!

ప్రతి చిన్న సాక్ష్యమూ నేనువ్రాస్తే చాలా ఉన్నాయి. దేవుని కృపే మాకు. ఏసుప్రభువు అంటేనే మా తల్లిదండ్రులకు చాలా చిన్న చూపు. ఏదో తక్కువ జాతివాళ్ళు కొలిచే వేస్టు దేవుడు అని తలచి, నా చిన్నతనంలో టీచర్స్‌ని అభిమానించే వారే గాని లోనికి రానియ్యక ఓ ప్రత్యేకత కన్పరిచేవారు.

**తరువాయిభాగం 26 వ పేజీలో**

సీరియల్

1

# వాక్యంలోని వనితలు

**- శ్రీమతి మెర్సీ ఇశ్రాయేలు**

ప్రపంచంలో స్త్రీకి విలువ తక్కువ, పురుషాధిక్యతగల ఈ ప్రపంచంలో స్త్రీ స్థానం వెనుకే ఉంది. "అర్ధరాత్రి ఒంటరిగా నడచి వెళ్ళగలిగిననాడు స్త్రీకి స్వాతంత్ర్యం వచ్చినట్టే"నని గాంధీ మహాత్ముడు ఒకనాడు చెప్పాడు. ఇంకా పట్టపగలే వెళ్ళలేని పరిస్థితి ఇప్పటి స్త్రీది. ఇప్పుడు క్లాసు రూముల్లో కూడా కూచోని చదువుకోవడం కష్టమయిపోతుంది కదా!

స్త్రీ స్వాతంత్ర్యముకోసం ఎన్నో పోరాటాలు జరిగాయి. మహిళాదినోత్సవాలు జరిగాయి. మహిళాబిల్లులు పాసయ్యాయి. సమాన హక్కులకోసం సంప్రదింపులు జరిగాయి. స్త్రీల కోసం ప్రత్యేక పోలీసుస్టేషన్లు, ప్రత్యేక కోర్టులూ వెలిశాయి. మహిళల స్వేచ్ఛ, మహిళాదినాలు జరిగాయి. స్త్రీలు మంత్రులైనా, ప్రధాన మంత్రులైనా, పైలెట్లయినా, రాకెట్లెక్కినా స్త్రీ పరిస్థితి మారలేదనే చెప్పాలి. ఇది నాగరికత వెనుకబడిన దేశాల్లోనే కాదు, నాగరికతలో బాగా ముందుకురికిన సంపన్న దేశాల్లో కూడా ఇదే పరిస్థితి.

ప్రపంచంలో పడతి పరిస్థితి మన ప్రస్తుత అంశం కాదు. దైవ వాక్యంలోని వనిత విషయం ఎలావుంది? అని. ఆదికాండంలో ఆదిలో దేవుని సృష్టిని చూస్తే...

వెలుగూ – చీకటీ, సూర్యుడూ – చంద్రుడూ, చెట్లూ – చేపలూ, జంతువులూ – పక్షులూ అన్నీ సృష్టించిన తరువాత అవన్నీ అనుభవించడానికి దేవుడు మానవుని సృష్టించాడు. మొదట పురుషుడే సృష్టించబడ్డాడు. తరువాత అతనికి సాటియైన సహాయంగా 'స్త్రీ'ని సృష్టించాడు.

వారిద్దరిని ఏదెనుతోటలో ఉంచాడు. అక్కడ దేవునితో సహవాసం చేస్తూ సంతోషంగా గడిపారు. కాని పాపం చేశారు. మొదట పాపంచేసింది స్త్రీ. కాని పురుషుడు కూడా పాపం చేశాడు. అయినా కఠినమైన శాపం స్త్రీకే కలిగింది. అది వేదనతో పిల్లలను కనడం!!

స్త్రీ తల్లికావడం ఒక శాపంగా వచ్చింది. " నీ ముఖపు చెమట కార్చి నీవు ఆహారము తిందువు". అది పురుషునికి వచ్చిన శాపం! ఈనాటి స్త్రీ వేదనతో పిల్లలను కనడమే కాదు పురుషుని కంటె ఎక్కువగానే చెమటకారుస్తుంది. ఇంటా బయటా పనులే! ఇద్దరి శాపాలు స్త్రీయే భరిస్తుందా ఇప్పుడు!

వాక్యంలో ఇంకా ముందుకుపోతే ఆదాము నూట ముప్పదియేండ్లు బ్రతికి తన పోలికగా, తన స్వరూపమున కుమారుని కని అతనికి "షేతు" అను పేరు పెట్టెను(ఆది 5:3) వేదనతో పిల్లలను కనడం హవ్వకు శాపమైతే "ఆదాము కనెను" అనడంలో పురుషాధిక్యత కనబడుతుంది. ఇంకా ముందుకు వెళ్తే వంశానుక్రమం వ్రాసినప్పుడు "కుమారులను, కుమార్తెలను కనెను" అని వ్రాసినా కుమార్తెల పేర్లు ఎక్కువగా వ్రాయకపోవడం గమనించదగినది.

మోషే ఇశ్రాయేలీయులను నడిపించినపుడు వారికి విధించిన కట్టడలు, విధులు గమనిస్తే – పురుషులకు ఒకవిధంగా స్త్రీలకు ఒకవిధంగా ఈ కట్టడలు విధించినట్లు గమనించగలము. స్త్రీ మగబిడ్డను కనినపుడు 33దినాలు కడగా ఉండాలని, ఆడపిల్లను కనిన 66దినాలు కడగా ఉండాలని వ్రాయబడింది (లేవి 12)

అంతేకాదు ఇశ్రాయేలీయులకు స్వాస్థ్యములను పంచి పెట్టునపుడు పురుషులకు మాత్రమే పంచిపెట్టబడింది. స్త్రీలకు స్వాస్థ్యములు లేవు. అయితే సంఖ్యా.27లో యోసేపు కుమారుడైన మనష్షే వంశములో 'సెలోపెహాదు' కుమారులు లేకుండ చనిపోయాడు.

అతని కుమార్తెలు మహల, నోయా, మిల్కా, హొగ్లా, తిర్సా 'మా తండ్రికి కుమారులు లేనంత మాత్రముచేత మా తండ్రిపేరు వంశములో నుండి మాసిపోనేల? మాకును స్వాస్థ్యములను దయచేయుమనిరి' (4వ). అప్పుడు వారికి మాత్రము స్వాస్థ్యము ఇచ్చినట్టు కనబడుతుంది.

యుద్ధాలు జరిగే సమయంలో దోపుడు సొమ్ములో అన్ని వస్తువులతో పాటు స్త్రీలను కూడా దోచుకెళ్ళేవారు. రాజులు ఓడిపోతే వారి భార్యలను, ఉండుపు కత్తెలను అన్ని వస్తువులతో పాటు దోపుడు సొమ్ముగా పంచుకునేవారు. స్త్రీని ప్రాణంలేని ఒక వస్తువుగా పరిగణించారు.

యూదులు ప్రార్థనచేసే సమయంలో "నన్ను స్త్రీగా పుట్టించనందుకు వందనములు" అని ప్రార్థించేవారట. అంటే స్త్రీకి విలువలేనందుకేనా!

**(సశేషం)**

# మనుష్యులు దేనివలన జీవిస్తారు? 1

**- లియో టాల్‌స్టాయ్**

మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములో నుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము. ప్రేమలేనివాడు మరణమందు నిలచియున్నాడు. **1యోహాను 3:14**

✦ ✦ ✦

చెప్పులు కుట్టుకొని జీవించే సైమన్‌కు సొంత ఇల్లు కాని, పొలంకాని లేవు. భార్యాబిడ్డలతో ఓ చిన్న పూరిపాకలో నివశిస్తున్నాడు. అతని సంపాదన అంతా అతని తిండికి మాత్రం సరిపోతున్నది. రెండు సంవత్సరాలుగా చలికోటు కొనుక్కోవాలని డబ్బు దాచిపెడితే 30 రూపాయలు మాత్రం అయినవి. ఓ రోజు సంతకివెళ్ళి చలికోటు కొనాలని ఆ ముప్పయి రూపాయలు భార్య చేతిలో నుండి తీసుకొని మధ్యాహ్నం బయలుదేరాడు. సంత ఊరిలో ఓ ఆసామి యాభై రూపాయలు బాకీ ఉన్నాడు. కనుక ఆ డబ్బు ఈ డబ్బు 80రూ. చలికోటు కొనాలని అతని ప్లాను. కాని అతని ఇంటివద్ద అతను దొరకలేదు. మరొకతను ఎనిమిది రూపాయలు ఇచ్చాడు. చెప్పులు కుట్టమని పాత చెప్పులు కూడా ఇచ్చాడు. ఆ చెప్పులు చేతికర్రకు తగిలించుకుని బయలుదేరాడు. ఇక చలికోటు కొనుక్కునేది లేదు కనుక చీకటి పడుతున్నది కనుక ఇంటి బాటపట్టాడు. దారిన సారాయికొట్టు వద్ద ఎనిమిది రూపాయలు ఖర్చుచేశాడు. సారాయి తాగిన తర్వాత శరీరంలోని చలి తగ్గింది. చలికోటు తీసుకొని రాకపోతే భార్య 'మాట్రియోనా' తగువులాడుతుంది అనే భయం కూడ చలితోపాటు శరీరంలో నుండి పోయింది.

రోడ్డు మూలలో ఓ దేవాలయం దగ్గర ఆగి దండం పెట్టుకొని ఆ ప్రక్కమూలలో ఏదో తెల్లటి రూపం ఉన్నట్లు గ్రహించి గబగబ నడవడం మొదలుపెట్టాడు. కాని మనసులో ఆ తెల్లగా ఉన్నది ఓ మనిషి అనుకొని వెనక్కు తిరిగి వచ్చాడు. ఓ యవ్వనస్తుడు తెల్లగా ఉన్నాడు. జానెడు గుడ్డ కూడా లేదు. చేతులు కాళ్ళు ముడుచుకొని తల వంచుకొని కూర్చున్నాడు.

సైమను దగ్గరగా వచ్చాడు. ఆ యువకుడు కనులెత్తి సైమన్‌ని చూశాడు. ఆ ఒక్క చూపు చాలు. సైమన్‌కి అతని మీద ప్రేమ కలిగింది.

కర్రకు తగిలించి ఉంచిన షూస్ అతనిముందు వేసి తను ధరించిన పై కోటు తీసి "ఇది వేసుకో" అని అతని కందించాడు. "నా వెంటరా! ఈ కర్ర పట్టుకుని నడువు" అంటూ "నీ పేరేంటి? ఏ ఊరు?" అన్నాడు. కాని ఆ యవ్వనస్తుడు ఏమి మాట్లాడలేదు. అతను ఏమి మాట్లాడక పోవడం చూసి "సరే! ఇప్పుడు ఇక్కడికి ఎలా వచ్చావు?" అన్నాడు. కాని ఆ యవ్వనుడు "నేను చెప్పలేను" అని, "కాని దేవుడు నన్ను శిక్షించాడు" అన్నాడు.

దూరాన్నుండే సైమన్ భార్య మాట్రియోనా భర్త కోసం ఎదురుచూస్తూ ఉంది. ఈపాటికి సంత ముగిసిపోయి ఉంటుంది. ఇంత ఆలస్యం ఎందుకు అనుకుంటూ చూసింది. దూరంలో చీకట్లో ఏదో తెల్లగా నడుస్తున్నట్లు అనిపించింది. ప్రక్కనే సైమన్ ఉన్నాడు. సైమన్ కోటు అతని మీద కప్పి ఉండటం చూసి సైమన్ ఆ యవ్వనస్తుని చేయి పట్టుకొని ఇంట్లోకి తీసుకొనివచ్చాడు. బెంచిమీద కూర్చో మన్నాడు. సైమన్ దగ్గర సారాయి వాసన వస్తుంది. చలికోటు లేదు. పైగా తనకోటు ఆ కుర్రాడికి కప్పాడు. వానికి తలమీద టోపీ కూడా లేదు. మాట్రియోనా కోపంతో ఊగిపోయింది.

"మాట్రియోనా! భోజనం పెట్టు" అన్నాడు సైమన్ బల్లమీద కూర్చుంటూ. మాట్రియోనా ఆ యవ్వనస్తుని చూస్తూ "భోజనము ఉంది, కానీ నీలాంటి త్రాగుబోతులకు కాదు" అన్నది. "నువ్వు కోటుకొనడానికి సంతకి వెళ్ళి ఓ దిగంబర స్వామిని ఇంటికి తెచ్చావు" అన్నది.

"నోరు పారేసుకోమాక. మనకు డబ్బులు ఇవ్వ వలసిన వాడు దొరకలేదు. అంతేకాకుండా ఈ అబ్బాయి

విషయం తెలియకుండా ఏమి మాట్లాడవద్దు" అంటూ తన జేబులో నుండి ముప్పయిరూపాయలు తీసి ఇచ్చాడు.

"నా దగ్గర ఉన్న చిల్లరతో త్రాగాను. చలి అంత ఎక్కువగా ఉన్నది" అన్నాడు.

మాట్రియోనా తన పెండ్లియిన నాటనుండి ఆమె పడుతున్న కష్టాలన్నీ ఏకరువు పెట్టసాగింది.

''మాట్రియోనా! నామాట విను'' అంటూ యవ్వనస్తుడు తనకు ఎలా తారసపడ్డాడో అంతా చెప్పాడు. "కాని గుర్తుంచుకో చలిలో గుడ్డలు లేకుండా ఆ మనిషి చచ్చిపోతే మనకు పాపం కదా! మనందరం ఒకరోజు చనిపోయేవాళ్ళమే! దేవుడు చూస్తున్నాడు" అన్నాడు. మాట్రియోనా చాలాసేపు అలానే నిలుచునిపోయి, ప్రక్కన డబ్బాలోంచి రొట్టెతీసి బల్లమీద పెట్టింది. సైమన్ రొట్టెను రెండుగా చేసి "రా నాయనా! తిను" అన్నాడు. ఆ యవ్వనుడు రొట్టె చేతపట్టుకున్నాడు. తలవాల్చి ఉన్నాడు. మాట్రియోనాకు అతనిని చూసే కొలది అతని మీద జాలి కలిగింది. గిన్నెలో ఉన్న కొంచెం కూరకూడ దగ్గర పెట్టింది.

ఇప్పుడు ఆ యువకుడు నిదానంగా మాట్రియోనా వైపు చూశాడు. నవ్వాడు. ఒక్కక్షణం ఇప్పుడు అతని ముఖం ప్రశాంతమైనది. రొట్టె తిన్న తర్వాత సైమన్ "ఇప్పుడు చెప్పు నువ్వు ఏ ప్రాంతపు వాడివి?" అన్నాడు.

"నేను ఈ ప్రాంతపు వాడి కాను. నన్ను దేవుడు శిక్షించాడు" అన్నాడు. మాట్రియోనా మరో పాత చొక్కా పెట్టెలోనుంచి తీసి ఆ యవ్వనునికి ఇచ్చింది. అతను కృతజ్ఞతగా చూశాడు. ఆ చూపు మాట్రియోనా ఎన్నడూ మర్చిపోలేదు.

పండుకొనిన తర్వాత "సైమన్! రేపటికి మనకు రొట్టె లేదు" అన్నది. సైమన్ ఏమి మాట్లాడలేదు. "నువ్వు అందరికి అన్నీ ఇస్తావు. మరి దేవుడు నీకేమి ఇవ్వడేం?" అన్నది.

సైమన్ మాట్రియోనా వైపు తిరిగి ''నిన్ను నాకిచ్చాడుగా" అన్నాడు.

మాట్రియోనాకు ఆ అబ్బాయి గుర్తుకు వచ్చాడు. పాపం అనుకొన్నది.

తెల్లవారిన తర్వాత ఆ అబ్బాయి ఇంటి వసారాలో సైమన్ ప్రక్కన కూర్చున్నాడు. కొంచెంసేపు సైమన్ చెప్పులు కుట్టడం చూసి, "నేను కుట్టేదా?" అన్నాడు. సైమన్ అతనిని చాలాసేపు తేరిచూసి ఆరె, దారం, కత్తి చేతికిచ్చాడు.

అరగంట తర్వాత చాలా అనుభవం ఉన్నవాని వలె చెప్పులు బాగుచెయ్యడం చూసి తృప్తిగా గోడకి ఆనుకున్నాడు సైమన్. ఆరునెలలు గడిచేటప్పటికి సైమన్ చెప్పుల కొట్లో మంచి అనుభవం కల్గిన పనివాడు ఉన్నాడని గ్రామగ్రామాల నుండి జనం వస్తున్నారు. సైమన్‌కి ఆదాయం బాగా పెరిగింది. ఈ క్రొత్త యవ్వనస్తుడు మరీ అవసరం అనిపిస్తే తప్ప ఎవ్వరితోను మాట్లాడేవాడు కాదు. ఆ యవ్వనస్తుని పేరు మిఖాయేలు.

ఒకరోజు ఉదయాన్నే సైమన్, మిఖాయేలు పనిచేసుకొంటుంటే ఓ ఖరీదయిన రథం వారి కొట్టుముందు ఆగింది. చాలా ధనవంతుడైన పెద్దమనిషి అందులో నుండి దిగాడు. సైమన్ ఇంట్లోకి వచ్చాడు. సైమన్ ఓ స్టూలు ఆయనకొరకు వేశాడు. అతను అందులో కూర్చుంటూ ప్రక్కన వచ్చిన కుర్రవాని చేతిలోనుండి ప్యాకెట్ విప్పదీసి ఖరీదయిన చర్మం తీసి బల్లమీద ఉంచి, "ఇది చాల ఖరీదయినది. దీనిని జర్మనీనుండి తెప్పించాను. నాకు బూట్లు కుట్టాలి. అవి ఒక సంవత్సరం అంతా పనిచెయ్యాలి. అలా కుట్టగలిగితే మీకు చాలా డబ్బు ఇస్తాను. కానీ దీన్ని చెడగొడితే మిమ్మల్ని జైలులో పెట్టిస్తాను" అన్నాడు.

సైమన్ మిఖాయేలు వైపు చూశాడు. కాని మిఖాయేలు ఆ ధనవంతుని ప్రక్కన మూలలో ఎవరినో చూస్తున్నట్లుగా కనిపించాడు. సైమన్ ఆశ్చర్యపోయాడు. మిఖాయేలను చాలాసేపు చూశాడు. ఇప్పుడు మిఖాయేలు ముఖం విప్పారింది. సన్నగా నవ్వి తలతిప్పి సైమన్ వైపు చూశాడు. "తీసుకోండి" అన్నాడు. సైమన్ ఆ తోలు తీసుకొని "రెండు రోజులు ఆగిరండి, మీ బూట్లు తయారవుతాయి" అన్నాడు. ఆ ధనవంతుడు పెద్దపెద్దగా మాట్లాడుతూ రథం ఎక్కి వెళ్ళిపోయాడు. గంట తర్వాత సైమన్ షాపులోనికి వస్తే మిఖాయేలు ఆ తోలుతో బూట్లు కుట్టకుండా చక్కని చెప్పులు కుడుతున్నాడు. సైమన్ గుండె పగిలిపోయింది.

ఇన్ని సంవత్సరాలలో ఎన్నడు పొరపాటుచెయ్యని మిఖాయేలు ఈ రోజు ఇలా చేశాడేంటి? అనుకొంటుంటే దూరంలో గుఱ్ఱం మీద ఓ భటుడు సైమన్ ఇంటి వైపునకు వస్తున్నాడు. సైమన్ బయటకు వచ్చేలోపల ఆ రౌతు క్రిందకిదిగి "ఇందాక బూట్లు కుట్టమని తోలు ఇచ్చిన నా యజమాని, ఇంటికి చేరకుండానే చనిపోయాడు. ఇప్పుడు బూట్లుతో పనిలేదు కనుక సమాధికి చెప్పులు కుట్టండి" అని చెబుతుంటే మిఖాయేలు చెప్పుల జత పొట్లాం కట్టి అతనికందించాడు.

మరొక సంవత్సరం గడచిపోయింది. మిఖాయేలు ఇంటికి వచ్చి ఆరు సంవత్సరాలైనది. అతను ఎక్కడికి బయటకు వెళ్ళడు. ఎవరితోను సరదాగా ఒక్కమాట కూడా మాట్లాడడు. 'నీవెక్కడి నుండి వచ్చావు?' అని సైమన్ గాని, అతని భార్యగాని మిఖాయేలును ఎన్నడు అడుగలేదు.

ఓరోజు ఉదయం మిఖాయేలు కూర్చుని పని చేస్తుంటే సైమన్ కుమారుడు లోనికివచ్చి "చూడు మిఖాయేలు! అటువైపుగా వారెవరో ఇటువస్తున్నారు" అన్నాడు. మిఖాయేలు పని ఆపి కిటికీలోనుండి చూశాడు. అలానే చాలాసేపు చూస్తూ ఉన్నాడు. మిఖాయేలు అలా ఎన్నడూ బయటకు చూడలేదు. ఓ లావాటి ఆమె ఇద్దరు కవల ఆడపిల్లలను నడిపించుకుంటూ లోనికి వచ్చింది. సైమన్ ఓ కుర్చీ వేశాడు. ఆ ధనవంతురాలైన స్త్రీ అందులో కూర్చుని ఆ ఇద్దరు ఆరుసంవత్సరాల వయసున్న పిల్లల్ని చెరోచేత్తో పట్టుకొన్నది.

"మీ పిల్లలు కవలపిల్లలా?" అన్నాడు సైమన్ వారికి మంచినీళ్ళు ఇస్తూ.

లేదండీ! వీరిద్దరూ నా బిడ్డలుకారు. నేను వీరిని చాకు కొంటున్నాను. వీరి తల్లి వీరు పుట్టంగానే చనిపో యింది. అప్పట్నుంచి వీరిద్దరు నాకు ప్రాణమయ్యారు. ఇది మరీని" అని అందులో కుంటుగా నడుస్తున్న అమ్మాయిని గట్టిగా హృదయానికి హత్తుకుంటూ "వీరిద్దరికీ మంచి బూట్లు కుట్టండి" అన్నది. సైమన్ మిఖాయేలును చూస్తే అతను తన పనిమాని ఆ ఇద్దరు పిల్లలను తదేకముగా చూస్తున్నాడు. నిజమే పిల్లలిద్దరు చక్కనివారే! కాని ఇతని చూపులు అతను వారిని బాగుగా ఎరిగిన వానివలె ఉన్నాడు. వారిలో ఒకమ్మాయి పాదము మెలిక తిరిగి ఉన్నది. అది చూస్తూ "ఈ పాదము పుట్టినప్పటి నుండి ఇలా ఉన్నదా?" అని సైమన్ ఆమెను అడిగాడు. "లేదయ్యా వారిద్దరిని నేను చాకు కుంటున్నాను. నా రొమ్ముపాలు త్రాగినవారే! కాని పుట్టినది నాకు కాదు" అన్నది.

"అదెలా జరిగిందమ్మా?" అన్నాడు సైమన్.

"ఇప్పటికి ఆరు సంవత్సరాల క్రితం వీరి తండ్రి మంగళవారం రోజు చెట్టు మీద కూలడం వలన మరణించి పాతిపెట్టబడ్డారు. వీరి అమ్మ శుక్రవారం రోజు వీరిని ప్రసవించి చనిపోయినది. వేరే గ్రామములో నివశిస్తున్న నాకు ఎనిమిది వారాల బిడ్డ అప్పటికే ఉన్నాడు. మరునాడు నేను వారిని చూడవెళితే ఆ ఊరివారు ఆ తల్లిని కడిగి పాతిపెట్టారు. నేను నా బిడ్డకు పాలిస్తున్నాను కనుక మరియొక్క పాలిచ్చే స్త్రీ దొరికేవరకు ఆ పిల్లలకు నన్ను పాలియ్యమని అడిగారు.

నేను పిల్లలను తీసుకొని ఇంటికి వచ్చాను. మొదట్లో ఈ కుంటిపిల్లకు పాలివ్వలేదు. ఎట్లాగయినా ఇది చనిపోతుంది అనుకున్నాను. కాని దాని ముఖం చూస్తే జాలేసింది. నా బిడ్డతో సహా ముగ్గురికీ పాలివ్వడం ప్రారంభించాను. ప్రభువు ఈ ముగ్గురికీ కాక ఇంకా ఎక్కువ పాలను నా రొమ్ములలో ఉంచాడు. రెండు సంవత్సరాల తర్వాత నా కుమారుడు చనిపోయాడు. ఈ బిడ్డలే నా బిడ్డలు అయ్యారు" అని ఆ కుంటిపిల్లని తన హృదయానికి హత్తుకున్నది. "వీరే నా జీవిత వెలుగు అయ్యారు" అన్నది. ఇదంతా వింటున్న మాత్రియోనా వచ్చి "నిజమైనమ్మా! తండ్రిలేకుండా తల్లిలేకుండా జీవించగలము కాని, దేవుడు లేకుండా ఎవరూ జీవించలేరు" అన్నది.

ఇలా వారు మాట్లాడుకుంటుంటే ఆకస్మికముగా ఆ గుడిసె అంతా పట్టపగలు వెలుగుతో నిండిపోయింది. అందరు మిఖాయేలు వైపు చూచారు. అతను రెండు చేతులు ముడుచుకొని మోకాళ్ళమీద నిలుచుని ఆకాశము వైపు చూస్తున్నాడు.

ఆ పిల్లలను తీసుకొని ఆ తల్లి వెళ్ళిపోయింది. మిఖాయేలు లేచి నిలుచుని తను కట్టుకున్న పై వస్త్రము తీసివేశాడు. సైమన్‌కు అతని భార్యకు వంగి నమస్కారము చేసి "అయ్యా! దేవుడు నా తప్పులు క్షమించాడు. మీరు కూడా నేను చేసిన తప్పులు ఏమైనా ఉంటే క్షమించండి" అన్నాడు. సైమన్ అతని దగ్గరగా వెళ్ళి "అయ్యా! మీరు మామూలు మనిషి కాదు. నిన్ను ఏమి అడుగను కానీ మీరు నా దగ్గర ఉన్న ఆరు సంవత్సరాలలో మూడు సార్లు మాత్రమే నవ్వారు. అప్పుడు నీ ముఖం వెలుగుతుండేది. దీనికి కారణం ఏమిటి?" అన్నాడు.

అప్పుడు మిఖాయేలు వెలుతురు నా ముఖంలో వెలిగింది. నా తప్పు విషయంలో బాధపడ్డప్పుడు, నేను నవ్వినప్పుడెల్లా దేవుడు నన్ను తెలుసుకోమనిన సంగతి తెలుసుకొన్నప్పుడు నేను మొత్తం మూడుసార్లు నవ్వింది యదార్థమే! మొదటిసారి నీ భార్య నా యెడల జాలి పడినప్పుడు తర్వాత ఆ ధనవంతుడు బూట్లు కుట్టమన్న ప్పుడు, తర్వాత ఈ చిన్నపిల్లలిద్దరు వచ్చినప్పుడు మూడవ ప్రశ్నకు జవాబు దొరికినప్పుడు నవ్వాను" అన్నాడు.

అప్పుడు సైమన్ "అయ్యా! దేవుడు మిమ్ములను ఎందుకు శిక్షించగా? మీరు నేర్చుకొనిన మూడు సత్యాలు ఏమిటి? దయచేసి చెప్పరా?" అన్నాడు.

"దేవుని ఆజ్ఞను మీరినందుకు ఆయన నన్ను శిక్షించాడు. నేను దేవుని దూతను. ఆయన ఒక స్త్రీ ఆత్మను తీసుకొని రమ్మన్నాడు. నేను భూమిమీదకు ఎగిరివచ్చాను. ఆ స్త్రీ అప్పుడే ఇద్దరు పిల్లలను ప్రసవించినది. ఆ స్త్రీ నన్ను చూడగానే ఓ దేవుని దూతా! ఇప్పుడు నన్ను తీసుకొని పోవద్దు. నా చిన్నబిడ్డలు చనిపోతారు. వీరి తండ్రి ఇప్పుడే పాతిపెట్టబడ్డాడు. దయచేసి కొంత సమయము ఇవ్వండి అని అడిగింది. అప్పుడు నేను ఒక పిల్లను తల్లిరొమ్ముమీద పెట్టి మరియొక బిడ్డను ఆమె చేతులకు అందించి దేవుని దగ్గరకు ఎగిరివెళ్ళాను.

అప్పుడు దేవుడు నువ్వు వెళ్ళి ఆ స్త్రీని తీసుకొని రా! తర్వాత నువ్వు మూడు విషయాలు నేర్చుకొని ఇక్కడికి రా అన్నాడు. నీవు తెలుసుకొనవలసినవి – ఒకటి మానవుల లో ఏమి నివశిస్తున్నది, రెండు మనిషికి ఇవ్వబడనిదేది, మూడు మానవులు దేనివలన జీవిస్తున్నారు.

అప్పుడు నేను మరలా భూమిమీదకు ఎగిరి వచ్చాను. తల్లి ఆత్మను తీసుకున్నాను. పిల్లలిద్దరు ఆమె రొమ్ముకు దూరమయ్యారు. తల్లి శరీరం దొర్లి ఓ బిడ్డ కాలుమీద పడింది. నేను ఆ గ్రామము పైకి ఎగరంగానే ఒక గాలి విసిరింది. నా రెక్కలు ఊడిపొయ్యాయి. ఆ తల్లి ఆత్మ దేవుని దగ్గరకు వెళ్ళింది. నేను రోడ్డున పడ్డాను" అని చెప్పాడు.

సైమనుకి, అతని భార్యకు తాము ఇంతకాలం ఎవరికి దుస్తులిచ్చి ఆహారం పెట్టారో తెలిసినప్పుడు చాలా సంతోషపడ్డారు.

నేను రోడ్డు ప్రక్కనపడి చలికి ఎగిరిపోయి దేవునికి కట్టబడిన ఓ ఆలయం వద్దకు వచ్చాను. కాని అది తాళం వేసి ఉంది. గాలికి తట్టుకొనేలాగున ఆ ఆలయం ప్రక్కగా కూర్చున్నాను. ఆకలి, అలసట, చలికి ఒణికిపోతున్నాను. చీకటి పడుతుంది. ఓ మనిషి తనలో తాను మాట్లాడుకుంటూ వెళ్తూ నన్ను చూసి భయపడ్డాడు. నేను కూడా బ్రతికివున్న మనిషిని చూసి భయపడిపోయాను. ఆ మనిషి చలి, ఆకలి గురించి, భార్యా బిడ్డల గురించి పెద్దగానే మాట్లాడుకుంటు న్నాడు. ఇతను నాకు ఏం సహాయం చేస్తాడు అనుకున్నాను. అతను నన్ను చూసి గబగబపోయాడు. కాని కొంచెంసేపటికి తిరిగివచ్చాడు. అతని ముఖంలో మరణం చూశాను. అతను నా ఒంటిమీద గుడ్డకప్పినప్పుడు అతనిలో దేవుని చూశాను. అతని ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఇంతకుముందు ఈ మనిషి రూపం కంటే భయంకర రూపములో కనిపించింది. ఆమె నాకు రొట్టె ఇవ్వడానికి ఒప్పుకోలేదు. ఆమె ముఖంలో మరణము చూశాను. నన్ను బయటకు వెళ్ళగొట్టడానికి వచ్చింది. కాని అతను దేవుని గురించి చెప్పగానే ఆమె మనసు మార్చుకొని నాకు రొట్టె ఇచ్చింది. ఇప్పుడు ఆమె ముఖంలో మరణము నేను చూడలేదు. ఆమె బ్రతికి ఉన్నది. ఆమెలో దేవుని చూశాను.

మనిషిలో ఏమి నివసిస్తుందో అర్థమయింది. ప్రేమ మనిషిలో నివసిస్తున్నది అని తెలుసుకున్నాను. కాబట్టి నవ్వాను. నేను మీతో నివశించాను. కొంతకాలానికి ఓ ధనికుడు బూట్లు కుట్టుకోవడానికి. అది ఒక సంవత్సరం నిలిచేదిగా ఉండాలి. కాని అతని వెంట నా స్నేహితుడు మరణదూతగా వచ్చాడు. అతను సాయంకాలం లోపల చనిపోతాడని నాకు తెలుసు. అతనికి ఆ సంగతి తెలియదు. మానవునికి ఏమి తెలుపబడలేదో అది తెలుసుకున్నాను. అప్పుడు రెండవసారి నవ్వాను.

మూడవదిగా ఆ తల్లి తను చనిపోతే బిడ్డల బ్రతుకు ఏమిటి? అని ఏడ్చింది. నేను కూడా నిజమే అనుకున్నాను. కాని ఆ బిడ్డలు తల్లి చనిపోయినందువలన ఏవిధంగా ఆశీర్వదించబడ్డారో చూచాను. కాబట్టి మనుష్యులు దేనివలన జీవిస్తున్నారో తెలుసుకున్నాను. ఈ మూడువిషయాలు తెలుసుకున్నాను. ఆ దూత వస్త్రములు తీసివేయబడ్డాయి. కండ్లు మిరిమిట్లు గొలిపే వెలుతురు ధరించుకొన్నాను. ఇప్పుడు ఆ దూత వద్దనుండి కాక పైనుండి వస్తున్న స్వరము వినబడుతుంది. మనుష్యులందరు ప్రేమవలన జీవిస్తున్నారని తెలుసుకున్నాను.

✦ ✦ ✦

లియోటాల్‌స్టాయ్ కథలు చిన్నప్పుడు చదివాను. ఇప్పుడు ఆ పుస్తకాలు దొరకలేదు. రెండు సంవత్సరాలు వెదికాను, దొరకలేదు. చివరికి కంప్యూటర్‌లో దొరికినవి. ఓ కథను ఓ నెలలోనే ముగించాలని కథ కొంచెం కుదించ బడింది.

ప్రతినెల ఒక పూర్తికథను ప్రచురిస్తాము.

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

**20 వ పేజి తరువాయి భాగం**

మా నాన్నగారిని ఒకసారి అడిగాను. కేలండర్‌లో స్లిప్‌లను డేట్సు వారిగా నేనే చింపేదానను. 'గుడ్‌ఫ్రైడే అంటే ఏంటి నాన్నా? మిగతా శుక్రవారాలు మంచివికావా? ఇదే గుడ్‌ఫ్రైడే అని రాశారు ఏంటీ?' అనేసరికి 'అది వేరేవాళ్ళు కొలుస్తారమ్మా! మనకి తెలీదు' అనేవారు క్లుప్తంగా. కానీ ఆ గుడ్‌ఫ్రైడే అంటే ఏంటో తెలిసి, యేసయ్య మనందరి పాపాల నిమిత్తం ఎంత యాతనలు, నిందలు, దెబ్బలు, ఉమ్మువేసినా శాంత స్వరూపి ఎలా భరించిందీ తెలిసి, ఎంతో విచారంతో దుఃఖించాను. ఈయనే సజీవుడైన నిజదేవుడు!

చివరగా మరొకటి! పెళ్ళిముందు అలివేణి కుండలు (హిందూవివాహం వారికే తెలుస్తుంది) పెళ్ళికూతురు చూడ కూడదట. చాలా అరిష్టం అని అంటారట. కానీ పొరపాటున అటు వెళ్తాననుకుని ఇటుగా మావాళ్ళు రిక్షాలోకి వెళ్ళడానికి సంసిద్ధమవగా, ఆ వెనుకే నన్ను నడిపించగా ఆ కుండలు చూసేశాను. మా అమ్మగారెంత బాధపడిపోయినారో! నాకు ఆమె బాధ, కంగారు (అప్పుడు) చూసి నాకూ ఏడ్పు వచ్చి చాలా భయపడినాను. పెద్ద తిరుపతిలో చాలా చక్కగా హిందూ పెళ్ళిమాది. ఆ కుండచూపుడు దోషం ఏమైనదో కదా! అంతా మన భ్రమ కదా! ఇది 1967లో సంగతి. నా పిల్లలకి చూపుడు తాళ్ళు కట్టించాను. కానీ నా మనుమలు ముగ్గురికీ ఎలాంటి తాళ్ళు కట్టించలేదు. నిజదైవం మనతో ఉన్నాడు కదా!

దేవునిలోకి వచ్చికూడా మూఢనమ్మకాలు పాటించే వారు కొందరున్నారు. వారు నామకార్థ క్రైస్తవులు. అందుకే కొంతవరకూ అన్యులలో మనకు విలువలేకుండా పోయింది. ఇంతవరకూ శ్రద్ధగా చదివినట్టి మీ అందరికీ, ఇలా చేయూత నిచ్చిన సహోదరుడు సామ్యేల్ రాజేంద్రగారికి, ఇంతవరకూ అన్నీ శ్రద్ధగా రాయించిన ఈ మహత్తర అవకాశం ఇచ్చిన నిజదేవుడు యేసయ్యకు కోట్లాది వందనాలు.

మా తొమ్మిదిమంది కుటుంబం గురించి మీ ప్రార్థనలలో దయవుంచి గుర్తు చేసుకోవాలని నా మనవి. ఇది రాయడం ఏ ఒక్కరినీ ఉద్దేశించి విమర్శించి కాదని, నా అనుభవాల పాతజీవితం అని ధైర్యంగా రాసుకున్నానని గ్రహించగలరు. అవసరం అనిపిస్తే నా మొబైల్ నెంబర్ 9032 616 304 కు ఫోన్ చేయగలరు.

# ప్రవక్తయైన యెహెజ్కేలు

యూదుల ముగ్గురు పెద్దప్రవక్తలలో ఆఖరివాడును క్రైస్తవుల నలుగురు ప్రవక్తలలో మూడవవాడు యెహెజ్కేలు. నాల్గవవాడు దానియేలు. సాదోకు యాజకుని కుటుంబము లోనివాడు. రాజైన నెబుకద్నెజరు యెరూషలేము మీద 597లో దండెత్తి యూదులను మొదటిసారి చెరగొనిపోయిన వారిలో ఒకడైయున్నాడు. తర్వాత 11సం॥లు ఆఖరుగా చెరపట్టినవారిని తీసుకొనిపోయి యెరూషలేమును తగుల బెట్టాడు. అందువలన చెరసాలప్రవక్తగా యెహెజ్కేలును పిలిచారు. యెహెజ్కేలు 1:2,3 చూడగా – యెహోయాకీము చెరపట్టబడిన అయిదవ సంవత్సరము ఆ నెలలో అయిదవ దినమున కల్దీయుల దేశమందున్న కెదారు నదీతీరమున యెహోవా వాక్కు బూజీ కుమారుడును యాజకుడగు యెహెజ్కేలునకు ప్రత్యక్షమయినది వ్రాయుట ద్వారా అతని వయసును మనం అంచనా వేయవచ్చును. యూదుల బబులోను ఉండిన కాలములో ఈయన ప్రవచనాలు ఉండుటవలన ఈయనను 'చెరనాటి ప్రవక్త' అన్నారు.

ఫ్లావియస్ జోసస్ యొక్క వ్రాతల వలన ఇతను చాలా చిన్నవయసులో బాలుడై ఉండగానే ప్రవచించాడు అన్నాడు. కాని ఈయన ప్రవచించేనాటికి ఇతనికి వివాహ మయినది. యెహెజ్కేలు చెరలోనికి వెళ్ళినపుడు అతని వయస్సు 25 సంవత్సరాలై యుండి ప్రవచనము మొదలు పెట్టడానికి (1:2,3) అయిదు సంవత్సరాలు ప్రకారం ఇతనికి 30 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు.

యెహెజ్కేలు చెరలోనున్న యూదులతో బబులోను నకు వాయవ్యదిశలోనున్న టెల్ అబీబ్ అనే ప్రదేశములోని 'చేబారు' నదీతీరమున నివశించాడు. అక్కడి పెద్దలతో కలిసి యాజకధర్మము నెరవేర్చాడు. అతని భార్య క్రీస్తుపూర్వం 586లో 9నెలల చెరకాలములో మరణించింది.

ప్రవచనము చెప్పేరోజులలో అతను చాలతక్కువ గా ఆహారం తీసుకొనేవాడు. కొన్నిసార్లు అతను రోజులకొద్దీ మైకము కమ్మినవాని వలె ఉండేవాడు. యెరూషలేము అంతము గురించి ఎక్కువగా ప్రవచించాడు. యెహెజ్కేలు ప్రవచనము చెప్పినప్పుడు జనులు అంతగా పట్టించుకోలేదు, పైగా ఆనందించారు యెహెజ్కేలు 33:31,32. వారి హృదయము లాభము నపేక్షించుచున్నది. నీవు వారికి వాయిద్యము బాగుగా వాయించు, మంచి స్వరము కలిగిన గాయకుడిగా ఉన్నావు. వారు నీ మాటలు విందురుగాని వాటిని అనుసరించి నడుచుకొనరు. అయినను ఆ మాట నెరవేరును. అది నెరవేరగా ప్రవక్తయొకడు వారిమధ్య నుండెనని వారు తెలుసుకొందురు.

అతని ప్రసంగము ద్వారా యెరూషలేములోని బలి కార్యక్రమము, కానుకల కార్యక్రమము, ఆత్మీయ బలులు గాను కానుకలు ప్రార్ధనలుగా మారినవి.

అతనిసేవలో 15సం॥లో పదవనెలలో అయిదవ దినమున యెరూషలేమునుండి తప్పించుకొనినవాడు ఒకడు వచ్చి పట్టణము కొట్టబడినందని చెప్పారు. అప్పటినుండి యెహెజ్కేలు చెరపట్టబడిన దుఃఖమును వదిలి హెబ్రీయుల విడుదల కొరకైనది ఆశపూరితమైన ప్రసంగములు చేయ సాగాడు. అందుకై 'ఎండిన ఎముకలు'తో హిబ్రూ ప్రజలు ఒకరోజు విడుదల పొందుతారని చెప్పారు. అతనిసేవ 20 నుండి 22 సంవత్సరాలు జరిగినది.

ప్రవక్తయైన యిర్మియా, యెహెజ్కేలు కలిసిచేసిన సేవద్వారా హిబ్రూప్రజలు బబులోనుచెరలో జీవించగలుగుట యేగాక తర్వాతి కాలములో యెహెజ్కేలు యిర్మియా కుమారులుగా భావించబడినను, అయితే తండ్రిపేరు బూజి (1:3). యిర్మయా అసలు వివాహము చేసుకోలేదు.

కొందరు పరిశోధకులు యెహెజ్కేలు సేవమధ్యలో యెరూషలేము దర్శించాడని చెపుతారు. కాని ఎక్కువమంది ఒప్పుకోరు. అతను ప్రయాణికుల ద్వారాకాని, దర్శనము ద్వారాకాని యెరూషలేము వార్తలు వినియుండవచ్చు నంటారు. యెహెజ్కేలు తన ప్రజలమధ్య నివశించాడు. వారిక ఆధ్యాత్మిక అవసరతలు తీర్చారు. ఆయన ప్రవక్తకంటే పాస్టరు అని చెప్పవచ్చును. కనుక అతనిని హిబ్రూపాస్టరు అనవచ్చును.

# సువార్తలలోని యేసు కథ



యేసుప్రభువు ఈ లోకములోనుండి ఆరోహణ మైనప్పుడు 'నేను త్వరలో తిరిగివచ్చి వారిని తనతో తీసుకొని వెళ్తానని చెప్పాడు. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరలావచ్చి నాయొద్ద ఉండుటకు మిమ్ములను తీసుకొని పోదును' అన్నాడు. అందువలన అపోస్తులుల కార్యములలో శిష్యులైన వారందరు యేసుప్రభువు రెండవరాకడ కొరకు ఎదురుచూస్తూ విశ్వసించిన వారందరు ఏక హృదయము ను, ఏకాత్మను కలిగిన వారైయుండిరి. ఎవడును తనకు కలిగిన వాటిలో ఏమియు తనదని అనుకోలేదు. వారికి కలిగినదంతయు వారికి సమిష్టిగా ఉండెను.

నేడోరేపో యేసయ్యతో కలసి వెళ్ళిపోతాము కనుక ఆయన కథను పుస్తకరూపములో వ్రాయ పనిలేదనుకున్నారు. ఈ విధముగా ఓ నలభై సంవత్సరాలు గడచిపోయాయి. పౌలుగారి పత్రికలో పేతురుగారి పత్రికలో బర్నబా, తోమా వ్రాసిన సువార్తలో విడిగా చదివేవారు.

కాలక్రమంలో పేతురును వెంబడిస్తున్న జాన్ మార్కు పేతురు సలహాప్రకారం మార్కు సువార్త వ్రాసాడు. తర్వాత మత్తయి, లూకా వ్రాశారు. దాదాపు మొదటి శతాబ్ధము చివరిలో ఈ మూడుసువార్తలు (మార్కు, మత్తయి, లూకా) చదివిన యోహాను 'యేసు' మరియమ్మ యోసేపుల కుమారుడు కాడు. యేసు ఆదియందు దేవుని యొద్ద దేవుడైయుండిన వాక్కు శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడు గా మనమధ్య నివశించెను అని వ్రాశాను.

మొదటి మూడు సువార్తలలో వ్రాసిన విషయాలు ఏవి వ్రాయలేదు. మొట్టమొదట అంద్రెయతో కలిసి యేసు వద్దకు వచ్చిన బాప్తీస్మమిచ్చే యోహాను శిష్యుడుగా ఉండి తర్వాత యేసు శిష్యుడైన తర్వాత యేసును ఒక్క క్షణమైనా చివరికి సిలువయొద్ద కూడ నిలుచుండిన యోహాను యేసును గురించి వ్రాసిన సంఘటనలు, సన్నివేశములు మరే సువార్త లలోను కనిపించవు.

నికోదేము రాత్రివేళ యేసును చూడవచ్చినపుడు 38 సంవత్సరాలు బేతెస్థ కోనేటివద్ద రోగిని స్వస్థపరచి నప్పుడు సమరయ స్త్రీతో యేసు మాట్లాడేటప్పుడు యోహాను ఒక్కడే ఆయన దగ్గర ఉన్నాడు. యేసు ఈ లోకమును వదిలి పరమునకు వెళ్ళిన చాలా సంవత్సరాలకు వ్రాయబడిన సువార్తలు నాలుగింటిలో కూడా వ్రాసిన రచయిత యొక్క జ్ఞానము జ్ఞాపకశక్తిని బట్టి సువార్తలు వ్రాయబడలేదు.

కాని పరిశుద్ధాత్మ దేవుడు ప్రేరేపించి వ్రాయ బడినవే సువార్తలు యేసుచేసిన అద్భుతకార్యములన్నిటిలో గొప్పదైన కార్యము నాలుగు దినములు సమాధిలో ఉంచిన శవమునకు మరలా జీవము తెప్పించడము. నాటి యూదుల నమ్మిక ప్రకారము చనిపోయిన వ్యక్తి యొక్క ఆత్మ మూడు దినముల వరకు శరీరాన్ని అంటిపెట్టుకొని యుంటుంది. నాల్గవదినమున దానిని అనుగ్రహించిన దేవుని దగ్గరకు వెళ్ళిపోతుంది.

యేసు అప్పుడే కొన్నినిమిషాల ముందు చనిపోయిన యాయీరు కుమార్తెను బ్రతికించిన ఒకరోజు ముందు మరణించిన నాయీను విధవరాలి కుమారుని ఇంక కొంచెంసేపటిలో పాతిపెట్టబోయే వానిని 'పాడె' మీదనే బ్రతికించినా అది ఏమి గొప్పకాదు. ఎందుకంటే చనిపోయి ఇంకా మూడు దినములు ముగియలేదు. అయితే అంతకు ముందు చనిపోయిన వారిని ఎవరూ బ్రతికించకపోయినా (పాతనిబంధనలో ఏలియా కథ పురాతనము)

ఇప్పుడు యేసుప్రభువు ఒక గొప్పఅద్భుతము భూమిమీద జరిగించబోతున్నాడు. అది జరిగించడానికి తాను ఎన్నుకొనిన కుటుంబము తను ఆత్మీయఆహారంతో నింపిన మార్త కుటుంబము. యోహాను సువార్త పదకొండవ అధ్యాయములో ఆయన బేతనియలో ఉన్నాడు. రెండవ బేతనియలో బాప్తీస్మము ఇచ్చే యోహాను కొంతకాలం నివశించినది. అది యొర్దానుకు తూర్పువైపు. యొర్దాను పడమరన యెరూషలేముకు అగ్రహారము వలె రెండు మైళ్ళ దూరములో ఒలీవల కొండకి దక్షిణముగా యొర్దానుకు దాదాపు 25మైళ్ళ దూరములో ఉండిన మార్తా మరియ

ఉండు బేతనియ. ఈ బేతనియలో నివశిస్తున్న పెద్దక్క మార్త, ఈమె చాల స్ట్రిక్ట ఉమెన్. కుటుంబాన్ని చక్కగా కాపాడుకుంటూ తనకంటే చిన్నవారైన చెల్లెలు, తమ్ముళ్ళను పెంచింది. లాజరు గురించి చెప్పేటప్పుడు అతను యేసు యొక్క శిష్యులలో ఒకడైనను యేసువెంబడి సంచారము చేసినట్లుగా లేదు. కుటుంబ పోషణకై శ్రమించే యవ్వనస్తుడు.

మరియు ఎన్నడు ఇల్లుదాటి గడపదాటని యవ్వనస్తురాలు. ఈ మరియను గురించి చెప్పేటప్పుడు లాజరు మరణసంఘటన తర్వాత చాలా రోజులకు ప్రభువుకు అత్తరుపూసి తలవెంట్రుకలతో ఆయన పాదములు తుడిచిన మరియ అని చెప్పబడింది. ఆమె మగ్దలా పట్టణ మరియ వలె కన్నీళ్ళతో ఆయన పాదములు కడుగలేదు. వయసులో చాలాచిన్నది. అక్క దగ్గర పెరిగింది. అన్న లాజరు అదుపులో ఉన్నది. యేసు నోటి జీవపుమాటలతో హృదయాన్ని నింపు కొనినందున యేసు మరణమును గురించి అంటే సిలువ మరణము పొందబోవుచున్నాడని ఆమెకు మాత్రమే దేవుడు బయలుపరచినందున ఆయన శరీరాన్ని పాతిపెట్టుటకు ఆమెను దీనిని (ఈసంఘటనను) ఉంచుకొననియ్యుడి అని ప్రభువు చెప్పాడు.

ఇప్పుడు సాధారణ జ్వరముగావచ్చి సీరియస్ అయిన తర్వాత మార్తమ్మకు అనుమానం వచ్చింది లాజరు మరణిస్తాడేమోనని. అందుకే 25మైళ్ళ దూరములో ఉన్న యేసు యొద్దకు 'ప్రభువా! ఇదిగో నీవు ప్రేమించువాడు రోగియైయున్నాడని వర్తమానము పంపిం చింది.' నాటి ప్రయాణ సాధనములనుబట్టి ఒకరోజు ప్రయాణము తర్వాతనే ఆ వార్తాహరుడు యేసు వద్దకు వచ్చాడు. ఆ వర్తమానమును శిష్యులందరూ విన్నారు. ఎంతో సీరియస్ అయితేనే కాని అలా వర్తమానము పంపరని అందరికి తెలుసు. యేసు ఈ వర్తమానము విని యెరూషలేము వెళ్ళటానికి వీలులేదని శిష్యులకు తెలుసు. ఇప్పుడు యెరూషలేము వెళ్తే ఖచ్చితంగా యూదులు ఆయనను రాళ్ళతో కొట్టి చంపుతారు. తండ్రి నాయందును నేను తండ్రి యందును ఉన్నామని మీరు గ్రహించి తెలుసు కొనునట్లు ఈ క్రియలను నమ్ముడని యూదులతో అంటే - వాళ్ళు రాళ్ళతో కొట్టి చంపాలని చూచారు.

'ఈ వ్యాధి మరణము కొరకు వచ్చినది కాదు' అని మరణము విషయం చెప్పాడు. అంతటితో ఈ సంఘటన ఆగిపోదు. 'కాని దేవుని కుమారుడు దానివలన మహిమ పరచబడునట్లు దేవుని మహిమ కొరకు వచ్చినద'ని చెప్పాడు. శిష్యులు హమ్మయ్య అనుకున్నారు. ఒకప్పుడు ఓ శతాధిపతి కపెర్నహోము నుండి వచ్చి తన కుమారుడు చావ సిద్ధముగా ఉన్నాడు. నువ్వు వచ్చి అతనిని స్వస్థపరచు మని శతాధిపతి యేసును బ్రతిమాలితే, నీవు వెళ్ళుము నీ కుమారుడు బ్రతికేయున్నాడని చెప్పిన ప్రభువు ఇప్పుడు లాజరు దగ్గరకు వెళ్ళకుండానే ఇక్కడనుండే ఆ జ్వరమును 'వదలి వెళ్ళుము' అని ఆజ్ఞ ఇయ్యవచ్చును. కాని ఆయన అలా చెయ్యలేదు.

యేసు మార్తను ఆమె సహోదరిని లాజరును ప్రేమించెను అన్నాడు యోహాను. నిజానికి లాజరు రోగియై యున్నాడని యేసునొద్దకు వార్త తీసుకొని బయలుదేరిన వ్యక్తి అలా బయలుదేరిన వెంటనే లాజరు చనిపోయాడు. ఆ సంగతి ఆ వార్తాహరుణికి తెలియదు. యేసు శిష్యులకు తెలియదు. యేసుకు తెలుసు. అప్పటికే లాజరు చనిపో యాడు. మరలా రెండు దినములు గడచిపోయాయి. లాజరు విషయం శిష్యులు మరచిపోయారు. మనము యూదయకు తిరిగి వెళ్ళుదము అని యేసు తన శిష్యులతో అనినమాట వారిమధ్య కలకలము రేపింది. ఇక్కడ చక్కగా రక్షణలో ఉంటే అపాయములోకి వెళ్దామంటాడేమిటి?

ఇప్పుడే యూదులు నిన్ను రాళ్ళతో కొట్టుటకు చూచుచుండిరే, అక్కడికి తిరిగివెళ్దామా? అన్నారు. పగలు పన్నెండు గంటలున్నవి గదా! ఒకడు పగటి వేళ నడచిన యెడల ఈ లోకపు వెలుగును చూచును గనుక వాడు తొట్రుపడడు. యేసు ఈ లోకమునకు వెలుగు గనుక ఆయన వెంట నడిచేవాడు దేనికి భయపడక నడుస్తాడు అని చెప్పి తోమావైపు చూస్తూ మన స్నేహితుడైన లాజరు నిద్రించు చున్నాడు. అతని మేలుకొలుప వెళ్ళుచున్నామని చెప్పాడు. అప్పుడు తోమా ముఖం విప్పారింది. సంతోషంతో మిగిలిన శిష్యులవైపు చూచాడు. దిదుమ ముందుకు వచ్చి ప్రభువా! నిద్రించిన యెడల బాగుపడునని అన్నాడు. వెంటనే ప్రభువు

లాజరు చనిపోయెను. మీరు నమ్మునట్లు నేనక్కడ ఉండలేదని మీ నిమిత్తము సంతోషించుచున్నాను. అయినను అతని యొద్దకు మనము వెళ్ళుదము రండి అని ప్రయాణ మయ్యాడు.

దిదుమ అనబడిన తోమా పేతురు ప్రక్కగా వచ్చి అంటే మనముకూడా ఆయనతో చనిపోవుటకు పోవుదమా? అని నడక సాగించాడు. అన్నీ కొండలే! 2500 అడుగులు లోతులో యోర్దాను లోయ ఉన్నది. సముద్రమట్టానికి 2000 అడుగుల ఎత్తులో ఒలీవల కొండ ఉన్నది. బహుభారమైన ప్రయాణం. ఎంతలేదన్నా ఒకరోజంతా నడవాలి. సాయం కాలం 3 గంటల ప్రాంతములో ఒలీవల తోటకు ఉత్తరంగా అరమైలు దూరంలో బేతనియ కొండ మరుగులో ఉన్నది. ఊరిబయట తోటవద్దకు రాగానే జనసమూహము ఆయనను చూచి ముందు వందలలో బయలుదేరి వేలలో తయారవు తున్నారు. మోయీ అనే యవ్వనస్తుడు పరుగెత్తుతూ మార్త ఇంటి వెనుక భాగమున వచ్చి బోధకుడు గవిని యొద్ద ఉన్నాడు అని చెప్పి పరుగెత్తాడు.

మార్త ఇంటిలోనికి వెళ్ళకుండా అలానే గవిని యొద్దకు గబగబ నడక ప్రారంభించింది. గబగబ వచ్చి ప్రభువా! నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావక ఉండేవాడు అని ఏడ్వడం ప్రారంభించింది. మరలా కొంత ఓదార్పుపొంది – ఇప్పుడైనను నీవు దేవుని ఏమడిగినను దేవుడు నీకనుగ్రహించునని ఎరుగుదును అని అన్నది ఏడుస్తూ.

యేసు ఆమె తలమీద చెయ్యి వేసి నిమురుతూ నీ సహోదరుడు మరలా లేచును అన్నాడు ఆప్యాయముగా. ఆమె తలెత్తి యేసు ముఖంలోకి చూస్తూ ఏడుస్తూ అంత్య దినమున పునరుత్థానమందు లేచునని యెరుగుదును అన్నది. యేసు ముఖం గంభీరముగా తయారయింది – పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాస ముంచు ప్రతివాడును బ్రతుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు అన్నారు. ఆయన స్వరము గంభీరముగా తయారయింది. మరలా మార్త వైపు చూస్తూ – ఈ మాట నమ్ముచున్నావా? అన్నాడు.

మార్త అవును ప్రభువా! నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడైన క్రీస్తువని నమ్ముచున్నాను అని వెనక్కు తిరిగి గబగబ ఇంటివైపు నడుస్తూ వెనుక వైపులో ఇంటిలో ప్రవేశించి తలవంచుకుని మోకాళ్ళమీద ఆనించు కొని ఉన్న మరియ చెవిదగ్గరకి వంగి బోధకుడు వచ్చి నిన్ను పిలుచుచున్నాడు అని అన్నది.

వెంటనే మరియ లేచి బయటకు వచ్చింది. మరియ వెంబడి కొందరు యూదులు కూడా లేచారు. బోధకుని పేరు వినగానే మరియలో దుఃఖం ఎక్కువైంది. పరిగెట్టునట్లుగా వచ్చి యేసుపాదాలమీద పడి ఏడ్వసాగింది. ఇప్పటికి మరియతో వచ్చిన స్త్రీలు కూడ ఏడ్వడం ప్రారంభిం చారు. మధ్యలో మరియ – ప్రభువా! నీవిక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండును అని ఏడ్వడం ప్రారంభించింది. మధ్యలో మరియను నిలువబెట్టారు. శిష్యులు కొంచెందూరంలో నిలబడ్డారు. యేసు ఆత్మలో మూలుగుచు అతనినెక్కడ ఉంచారు అంటూ కన్నుల వెంట నీరుకార్చాడు. ప్రభువా! వచ్చిచూడు అంటూ ప్రభువుకు దారి ఇచ్చారు. సమాధి ఓ పెద్ద గుహ. పెద్దరాయి దాని మీదగా అడ్డం పెట్టారు. యేసు అక్కడ నిలచి ఈ రాయిని తీసివేయండి అన్నాడు. వెంటనే మార్త అడ్డం వచ్చి ప్రభువా! అతను చనిపోయి నాలుగు దినములైనది. ఇప్పటికి వాసన కొట్టునని అన్నది.

ప్రభువు మార్త ముఖంలోకి చూస్తు నీవు నమ్మిన .యెడల దేవుని మహిమ చూతువని నేను నీతో చెప్పలేదా? అన్నాడు. అప్పుడు నలుగురు ఆ రాతిని పొర్లించారు. లోపల చీకటి అంధరు సమాధిలోకి చూస్తున్నారు. యేసు ఆకాశము వైపు కన్నులు పైకెత్తి తండ్రి నీవు నా మనివి వినినందుకు నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. నీవు ఎల్లప్పుడు నా మనవి వినుచున్నావని నేనెరుగుదును గాని, నీవు నన్ను పంపితివని చుట్టూ నిలచియున్న ఈ జనసమూహము సమ్మునట్లు వారికోసమే ఆ మాట చెప్పితిని అని సమాధివైపు చూస్తూ లాజరు! బయటికి రా! అని చాలాపెద్దగా పిలిచాడు.

అంతా నిశ్శబ్దం. అందరి కండ్లు సమాధిలోపలి భాగం వైపు...

**(సశేషం)**

North East West South వార్తలు

# క్రైస్తవులపై దాడులు

**హిందూ మతోన్మాదులు క్రైస్తవులను లక్ష్యంగా ఎంచుకొని అమానుషంగా, తప్పుడు నిందలు ఆరోపించి, హింసిస్తూ, వారిని చంపుటకు కూడా వెనుదీయుట లేదు.**

గ్లోబల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ వారు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు హత్యల వెనుక హిందూ మతోన్మాదుల హస్తం ఉందని నమ్ముతున్నారు. ఈ మధ్యకాలంలో 17 సంవత్సరాల నిరుపమ ప్రధాన్ అనే అమ్మాయి మే 12,2011న స్కూలునుండి తిరిగి వస్తుండగా మానభంగం గావించబడి, హత్య చేయబడింది. ఆమె తండ్రి సిత్రియన్ ప్రధాన్‌గారు ఆమె యొక్క హత్య గురించి ఎంక్వైరీ చేయమని కోరగా ఆసియా వార్తల ప్రకారం – ఆమె హత్య గురించి పోలీసులు ఏమీ చేయలేదని తెలిసింది.

మరొక సంఘటనలో పోలీసులు జూన్ 10,2011న హత్య చేయబడిన క్రైస్తవ సువార్తికుడి పోస్ట్‌మార్టం రిపోర్ట్‌ను భర్త చనిపోయిన సాల్ ప్రధాన్‌కు ఇవ్వలేదు. ప్రధాన్‌కు వేరొక పల్లెలో క్రొత్తగా ఉద్యోగం వచ్చింది. ఒకరోజు అతను ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు అతనికోసం వెదుకగా ఒక చెరువు దగ్గర అతని శవాన్ని కనుగొన్నారు. పోలీసులు యాధావిధిగానే అతను చలి ఎక్కువగా ఉండుట వలన మరణించాడని పేర్కొన్నారు. తర్వాత అతని సహోద్యోగులు, హిందూ తీవ్రవాదులు అతని మరణాన్ని హత్యే అని ఒప్పుకున్నారు.

**మే 8న** కంపాస్ డైరెక్ట్ న్యూస్ ప్రకారం, పాస్టర్ బి. విజయకుమార్ మరియు అతని కుటుంబము ప్రార్ధన కూటము నుండి ఇంటికి వెళ్తుండగా హిందూ తీవ్రవాదులు వారిని అడ్డుకున్నారు. మూడు గంటలసేపు వీరు ఈ హిందూ తీవ్రవాదులచే ఆపివేయబడ్డారు. తర్వాత పోలీసులు వచ్చి కుమార్‌ను ప్రశ్నించారు. మీరు ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టి వెళ్ళిపొండి, ఇక్కడేమైనా జరిగితే మాకు సంబంధంలేదు పోలీసులు పాస్టర్‌తో అన్నారు. వెంటనే ప్రాంతీయ వార్తా పత్రికలలో కుమార్ ప్రజలను డబ్బుద్వారా ఆశ చూపించి వారిని క్రైస్తవ్యంలోకి మారుస్తూ, మతమార్పిడి చేస్తున్నాడని తప్పుగా ప్రచురించారు.

మధ్యప్రదేశ్‌లో శివరాజ్ మారవి అనే పాస్టర్‌గారిని హిందూ తీవ్రవాదులు అడ్డుకొని అతను ఆదివారం నాడు అప్పుడప్పుడు ప్రార్ధనలకు వాడే చిన్న ఇంటిని నాశనం చేశారు. తర్వాత ఆ తీవ్రవాదులు మే 4న ఆ పాస్టర్‌పై కేసు పెట్టారు. పోలీసులు పాస్టర్‌ను మతమార్పిడి వ్యతిరేక చట్టం క్రింద అరెస్టు చేశారు. కంపాస్ డైరెక్ట్ న్యూస్ వారు మారవి ఈ హిందూ తీవ్రవాదుల యొక్క అరాచకత్వాలకు భయపడి ఆ ఇంటిలో ప్రార్ధనలు ఆపివేశారని తెలిపారు.

మహారాష్ట్రలో కూడా హిందూ తీవ్రవాదులు ఒక చర్చి బిల్డింగ్ నిర్మాణాన్ని అడ్డుకొని, ఆ ప్రాంతం నుంచి అక్కడున్న క్రైస్తవులందరిని వెళ్ళగొట్టారు. వారిని ఆ ప్రాంతంలోనికి రానీయక అనుమతి కొరకు ఆ ప్రాంత పెద్దని అడుగమన్నారు. కానీ అతను కూడా వీరికి సహకరించలేదు. వీరికి జీవనోపాధి లేకుండా చేశారు. వీరి పిల్లలను కూడా ఆ ప్రాంతంలోని స్కూళ్ళలోనికి అనుమతించలేదు.